## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

మహారాణిపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కరవేదిక కార్యక్రమాన్ని ఈనెల 22న రద్దుచేసినట్టు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22, 23 తేదీల్లో నగరంలో జరగనున్న 28వ జాతీయ ఈ గవర్నెన్స్‌కు ముఖ్యమంత్రి హాజరవుతున్నారని, ఈ నేపథ్యంలో అధికారులంతా ఏర్పాట్లలో నిమగ్నమైన సందర్భంగా పీజీఆర్ఎస్‌ను తాత్కాలికంగా రద్దుచేశామన్నారు. జిల్లా వాసులు సహకరించాలని కోరారు. కాగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోనూ పీజీఆర్ఎస్‌ను రద్దుచేసినట్టు కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు.

## నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు రాక

- ఈ-గవర్నెన్స్ సదస్సులో పాల్గొననున్న సీఎం



విశాఖపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం నగరానికి రానున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు ఉండవిల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 9.30 గంటలకు నగరంలోని కోస్టల్ బ్యాటరీ వద్ద గల హెలిప్యాడ్‌కు, అక్కడి నుంచి 9.40 గంటలకు నోవాటెల్ హోటల్‌కు చేరుకుంటారు. ఉదయం 9.45 గంటలకు జరగనున్న ఈ గవర్నెన్స్ సదస్సుకు సంబంధించిన ఎగ్జిబిషన్ ప్రారంభించిన అనంతరం సదస్సులో పాల్గొంటారు. ఉదయం 11.45 గంటలకు నోవాటెల్ నుంచి బయలుదేరి కోస్టల్ బ్యాటరీకి చేరుకుని, మధ్యాహ్నం 12 గంటలకు హెలికాప్టర్‌లో ఉండవిల్లి వెళతారు.

### కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ రాక

కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎర్త్ సైన్స్ సహాయమంత్రి జితేంద్రసింగ్ సోమవారం నగరానికి వస్తారు. భువనేశ్వర్ నుంచి విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 1.55 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని 2.30 గంటలకు నోవాటెల్ హోటల్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి 4.30 గంటల వరకు ఈ గవర్నెన్స్ సదస్సులో పాల్గొంటారు. అనంతరం ఢిల్లీ వెళతారు.

## నేటి నుంచి ఈ-గవర్నెన్స్ సదస్సు

- 1000 మంది ప్రతినిధులు రాక

విశాఖపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన 28వ ఈ -గవర్నెన్స్ జాతీయ సదస్సుకు విశాఖ వేదికగా నిలిచింది. సోమవారం నుంచి రెండురోజులపాటు నోవాటెల్‌లో జరగనున్న సదస్సుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 1000 మంది ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగ నిపుణులు హాజరుకానున్నారు. 'వికసిత భారత్, సివిల్ సర్వీసెస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' థీమ్‌పై జరుగుతున్న సదస్సును సోమవారం ఉదయం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. దేశంలో పాలనాపరంగా సురక్షితమైన, స్థిరమైన ఇ-సేవలు అందించడానికి కొత్త విధానాల కోసం సదస్సులో నిపుణులు చర్చించనున్నారు. సదస్సులో వికసిత భారత్ కోసం ఏఐ టెక్నాలజీ, సివిల్ సర్వీసెస్ పాలనలో డిజిటల్, సైబర్ సెక్యూరిటీ, మౌలిక సదుపాయాలు, వ్యవసాయానికి డిజిటల్ పరిష్కారం, గ్రామ పంచాయతీల్లో అట్టడుగు ఇ-గవర్నెన్స్ కార్యకలాపాలు తదితర అంశాలపై చర్చించనున్నారు సదస్సుకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లుచేసింది. ఉన్నతాధికారుల నేతృత్వంలో పలు కమిటీలను నియమించింది. భద్రతా చర్యలు చేపట్టారు.

## ఇంజనీరింగ్‌లో అక్రమాలపై కమిషనర్ దృష్టి


జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

### పనుల నాణ్యత, రికార్డింగ్‌లో పారదర్శకత ఉండేలా చర్యలు

- వార్డు ఎమినిటీ కార్యదర్శులకు ఎంబుక్ రికార్డింగ్ బాధ్యత
- ఆపై ఏఈలు, ఇతర అధికారుల పర్యవేక్షణ
- బిల్లు ఫైల్‌పై ఎమినిటీ సెక్రటరీ సంతకం లేకుంటే తిరస్కరణ



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో జరుగుతున్న అక్రమాలపై కమిషనర్ కేతన్‌గార్గ్ దృష్టిసారించారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఏఈ) కొరత కారణంగా వార్డుల్లో జరిగే అభివృద్ధి పనుల పర్యవేక్షణ కొరవడుతోంది. దీనివల్ల పనుల్లో నాణ్యత లోపించడంతోపాటు చేసిన పనిని పక్కాగా కొలతలు వేయకుండానే ఎంబుక్ రికార్డు చేసేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనికి అడ్డుకట్టవేసేందుకు ఇకపై వార్డుస్థాయిలో జరిగే అన్నిరకాల అభివృద్ధి పనుల పర్యవేక్షణ, ఎంబుక్ రికార్డింగ్ వంటి బాధ్యతలను వార్డు సచివాలయం ఎమినిటీ సెక్రటరీలకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

జీవీఎంసీ పరిధిలో ఏటా సగటున రూ.500 కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతుంటాయి. వార్డుల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, తారు రోడ్లు, రక్షణ గోడలు, సామాజిక భవనాలు, పైప్‌లైన్ల నిర్మాణం, సుందరీకరణ వంటి పనులు ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో జరుగుతుంటాయి. వాటిని వార్డు పరిధిలోని వర్క్‌ఇన్‌స్పెక్టర్లు/ఏఈల సమక్షంలో కాంట్రాక్టర్లు చేపట్టాలి. నాణ్యత తగ్గకుండా ఒప్పందంలో పేర్కొన్న మాదిరిగా పనులు జరిగేలా పర్యవేక్షించాలి. అయితే వర్క్‌ఇన్‌స్పెక్టర్లు/ఏఈల కొరత కారణంగా ఐదారు వార్డులకు ఒక వర్క్‌ఇన్‌స్పెక్టర్/ ఏఈ బాధ్యతలు చూడాల్సి వస్తోంది. దీనివల్ల జరిగే ప్రతి పనిని దగ్గరుండి పర్యవేక్షించడం, పూర్తిచేసిన పనికి పక్కాగా కొలతలు వేసి ఎంబుక్‌లో రికార్డుచేయడం సాధ్యపడడం లేదు. ఈ నేపథ్యంలో అధికారులు లేకపోయినా కాంట్రాక్టరే పనులను పూర్తిచేసేస్తున్నారు. తర్వాత ఎంబుక్ రికార్డింగ్ కోసం ఒత్తిడి చేస్తుండడంతో ఆదరాబాదరాగా కొలతలు వేసి ప్రక్రియను పూర్తిచేసి, బిల్లు కోసం ఉన్నతాధికారులకు పంపిస్తున్నారు. దీనివల్ల పనుల్లో నాణ్యత కొరవడడంతో పాటు చేసిన పనికంటే ఎక్కువ పనికి బిల్లు చెల్లింపులు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### రంగంలోకి కమిషనర్

ఈ నేపథ్యంలో కమిషనర్ కేతన్‌గార్గ్ వీటికి అడ్డుకట్టవేసేందుకు వీలుగా వార్డు సచివాలయంలోని ఎమినిటీ సెక్రటరీలను ఇంజనీరింగ్ పనుల్లో భాగస్వాములుగా చేర్చారు. వార్డు సచివాలయం పరిధిలో జరిగే అభివృద్ధి పనులను సంబంధిత ఎమినిటీ సెక్రటరీ స్వయంగా పర్యవేక్షించడంతోపాటు నాణ్యత లేకుండా పనులు చేస్తే దానిపై అధికారికంగా అభ్యంతరం తెలపడంతోపాటు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చే వెసులుబాటు కల్పించారు. అలాగే ఎంబుక్ రికార్డింగ్ బాధ్యతను ముందుగా వార్డు ఎమినిటీ సెక్రటరీలకే అప్పగిస్తూ ఆదేశాలు జారీచేశారు. వారు ఎంబుక్‌లో రికార్డుచేసిన తర్వాత ఏఈలు ఆ పైఅధికారులు దానిని తనిఖీచేసి బిల్లు ఫైల్ పెట్టాల్సి ఉంటుంది. ఆ ఫైల్‌ను వార్డు ఎమినిటీ సెక్రటరీ రికమెండ్ చేసినట్టు సంతకం తప్పకుండా పెట్టాల్సిందేనని కమిషనర్ స్పష్టంచేశారు. ఒకవేళ ఎమినిటీ సెక్రటరీ సంతకం లేకుండా బిల్లు కోసం వచ్చే ఫైల్‌ను తిరిగి వెనక్కిపంపించేస్తానని కమిషనర్ స్పష్టం చేశారు. దీనివల్ల

... మిగతా 6వ పేజీలో

## లేఅవుట్‌లలో దొంగలు!

- భారీగా ఇసుక, ఇనుము, సిమెంట్ మాయం
- బయటపడితేనే పోలీసులకు ఫిర్యాదులు
- అక్రమార్కులకు కిందిస్థాయి అధికారుల సహకారం
- మెటీరియల్ నిల్వ లెక్కలు తేల్చాలని కలెక్టర్ ఆదేశం
- రంగంలోకి హౌసింగ్ అధికారులు


గుల్లలపాలెం లేఅవుట్‌లో ఐరన్ నిల్వలు (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం/పద్మనాభం/ఆనందపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):

నగర శివారులో సెంటు స్థలాల్లో నిర్మిస్తున్న ఇళ్లకాలనీలో కొన్నిచోట్ల దొంగలు పడ్డారు. ఇనుము, ఇసుక, సిమెంట్‌ను అందినకాడికి ఎత్తుకుపోయారు. మరికొన్ని చోట్ల హౌసింగ్ సిబ్బంది, లేవుట్‌లలో సైట్ ఇంజనీర్లు, ఇతర సిబ్బంది ఏకమై కొంత ఇనుము, ఇసుక, సిమెంట్ అమ్ముకున్నారు. సుమారు రెండేళ్లుగా జరుగుతున్న మెటీరియల్ మాయంపై అధికారులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసి చేతులు దులుపుకుంటున్నారు.

తాజాగా పద్మనాభం మండలంలోని తునివలస లేఅవుట్‌లో ఇసుకను పబ్లిక్‌గా ట్రాక్టర్‌తో తీసుకెళ్లిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ నేపథ్యంలో మొత్తం లేఅవుట్‌లలో ఇసుక, ఇనుము, సిమెంట్‌పై లెక్కలు తేల్చాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విశాఖ, అనకాపల్లి పరిసరాల్లో 73 లేఅవుట్‌లలో సుమారు లక్ష ఇళ్లు నిర్మిస్తున్నారు. ప్రతి ఇంటికి 90 బస్తాల సిమెంట్, 20 టన్నుల ఇసుక, 435 కిలోల ఇనుము ప్రభుత్వమే సరఫరా చేస్తోంది. నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రాకపోవడంతో 30 కంపెనీలకు బాధ్యతలు అప్పగించారు.

### మెటీరియల్ గల్లంతు

ఆది నుంచీ లేఅవుట్‌లకు సరఫరాచేసిన ఇసుక, ఇనుము, సిమెంట్ రక్షణపై ఆయా నిర్మాణ సంస్థలు చర్యలు తీసుకోలేదు. దీంతో అవి దొంగలపాలయ్యాయి. పైడివాడ అగ్రహారంలో భారీగా సిమెంట్, ఇనుమును స్థానిక ప్రజాప్రతినిధి తరలించేశారు. ముదపాక

... మిగతా 6వ పేజీలో

## ధర దిగింది!

- తగ్గిన విశాఖ డెయిరీ పాల ఉత్పత్తుల ధరలు
- నేటి నుంచి అమల్లోకి కొత్త రేట్లు
- జీఎస్టీ సంస్కరణల ప్రభావం



అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సంస్కరణలు సోమవారం నుంచి అమల్లోకి రానుండడంతో విశాఖ డెయిరీ పాల ఉత్పత్తుల ధరలు తగ్గనున్నాయి. డెయిరీకి చెందిన పలు ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గుతుండడంతో వాటి ధరలను తగ్గించామని డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డెయిరీ ఉత్పత్తి చేసే యూహెచ్‌టీ టోన్డ్ మిల్క్ లీటర్ ప్రస్తుతం రూ.69 ఉండగా ఇది రూ.66కు తగ్గనుంది. యూహెచ్‌టీ స్టాండర్డ్ మిల్క్ లీటర్ రూ.75 నుంచి రూ.72కు, ఆవు నెయ్యి 500 గ్రాములు రూ.330 నుంచి రూ.309కు, కేజీ రూ.650 నుంచి రూ.608కు తగ్గుతాయి. పన్నీర్ 200 గ్రాములు రూ.90 నుంచి రూ.86కు, కేజీ పన్నీరు రూ.420 నుంచి రూ.400కు, మిల్క్‌షేక్‌లు రూ.25 నుంచి రూ.24, ప్లమ్ కేక్ 100 గ్రాములు రూ.30 నుంచి రూ.27కు తగ్గనుంది. ఈ ధరలు సోమవారం నుంచి అమల్లోకి వస్తాయని చైర్మన్ వివరించారు.

## దూర విద్య ఫలితాలెన్నడో?

- ఈ ఏడాది మార్చిలో పరీక్షలు నిర్వహించిన ఏయూ
- తాజాగా ప్రారంభమైన మూల్యాంకన ప్రక్రియ
- సుమారు 12 వేల మంది విద్యార్థుల నిరీక్షణ
- ఉన్నత విద్యా కోర్సుల్లో చేరలేకపోతున్నామని ఆవేదన

విశాఖపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి నిదర్శనంగా ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన దూరవిద్య పరీక్షల ఫలితాలను ఇప్పటికీ విడుదల చేయకపోవడాన్ని ప్రస్తావిస్తున్నారు. ఫలితాలు వెలువడక ఉన్నత విద్యా కోర్సుల్లో చేరే అవకాశం కోల్పోయామని విద్యార్థులు గగ్గోలు పెడుతున్నారు.




సాధారణంగా పరీక్షలు నిర్వహించిన 25 నుంచి 30 రోజుల్లో ఫలితాలు వెల్లడించాల్సి ఉంది. అందుకు విరుద్ధం గా దూరవిద్య పరీక్షలు జరిగి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఫలితాలను వెల్లడించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. ఉన్నత చదువుల కోసం ఆరాటపడే వారంతా ఆశలు వదులుకునే పరిస్థితి ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నెలలు గడుస్తున్నా..

ఈ ఏడాది మార్చిలో దూరవిద్య డిగ్రీ, పీజీ సెమిస్టర్, సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించారు. ఆయా కోర్సులకు సంబంధించి సుమారు 12 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరంతా ఇతర ఉన్నత విద్యా కోర్సుల్లో చేరాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో పరీక్షలు ముగిసినప్పటి నుంచి ఫలితాల కోసం ఎదురుచూస్తు న్నారు. నెలలు గడుస్తున్నా అధికారులు స్పందించకపోవడంతో వారిలో ఆందోళన నెలకొంది. జాప్యానికి కారణాలపై అధికారులను ప్రశ్నిస్తున్నా సమాధానం లభించడం లేదంటున్నారు. ఎప్పుడు ఫలితాలు విడుదల చేస్తారో కూడా స్పష్టత ఇవ్వడం లేదని వాపోతున్నారు.

### ప్రారంభమైన మూల్యాంకనం..

దూరవిద్య విద్యార్థుల నుంచి ఫలితాలపై తీవ్రస్థాయిలో ఒత్తిడి వస్తుండడంతో అధికారులు తాజాగా అప్రమత్తమ య్యారు. గత వారం రోజులుగా మూల్యాంకనం ప్రక్రియను ప్రారంభించినట్టు తెలుస్తోంది. పరీక్షలు ముగిసి ఐదు నెలలు దాటింది. ఇప్పటివరకు జవాబుపత్రాల మూల్యాం కనం చేయకుండా అధికారులు ఏం చేశారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ దశలో ఎప్పుడు ఫలితాలు వెల్లడిస్తారో తెలియని పరిస్థితి. దీనిపై ఏయూ దూర విద్య డైరెక్టర్ అప్పలనాయుడును వివరణ కోరగా.. సాంకేతిక కారణాలతో మూల్యాంకనం ఆలస్యమైందన్నారు. ఇప్పటికే ప్రక్రియను ప్రారంభించామని, కొద్దిరోజుల్లో ఫలి తాలు వెల్లడిస్తామన్నారు.

### విద్యార్థుల నిరీక్షణ..

ఏయూ దూర విద్య కోర్సులకు డిమాండ్ ఉంది. దీంతో అనేక వర్సిటీల్లో ఈ అవకాశం ఉన్నప్పటికీ ఇక్కడ చేరేం దుకు విద్యార్థులు ఆసక్తి చూపిస్తుంటారు. ప్రస్తుతం ఫలితాల కోసం ఎదురుచూస్తున్న వారిలో బీఏ, బీకాం, బీఎస్సీ, ఎమ్మెస్సీ సైకాలజీ, తెలుగు తదితర కోర్సుల్లో చేరిన విద్యార్థులున్నారు.

## పోలీస్ కమిషనరేట్‌కు స్కోచ్ అవార్డు

విశాఖపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌కు ప్రతిష్ఠాత్మకమైన స్కోచ్ అవార్డు లభించినట్టు సీపీ శంఖబ్రతబాగ్చి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం అందించేందుకు కమిషనరేట్‌లో 'రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రం' ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ కేంద్రం ద్వారా హిట్ అండ్ రన్ కేసుల్లో మృతిచెందినవారి కుటుంబసభ్యులకు, గాయపడినవారికి ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకున్నారు. ఒక్కో బాధితుడికి ఒక కానిస్టేబుల్‌ను అప్పగించి ఆయా శాఖల నుంచి సర్టిఫికెట్లను తీసుకుని బీమా కంపెనీలకు అందజేయడం, ప్రయోజనాలు విడుదలయ్యేలా చూస్తున్నారు. దీనివల్ల 2022 ఏప్రిల్ ఒకటి నుంచి ఇప్పటివరకు రూ.63.5 లక్షలను బాధితులకు అందజేశారు. దీనిని గుర్తించిన స్కోచ్ సంస్థ కమిషనరేట్‌కు అవార్డును ప్రకటించిందని సీపీ వివరించారు.

## రైల్వేలో రౌండ్ ట్రిప్ ప్యాకేజీ

- రానుపోను బేస్ చార్జీలపై 20 శాతం తగ్గింపు



విశాఖపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికులకు రౌండ్ ట్రిప్ ప్యాకేజీ అందుబాటులోకి వచ్చింది. పండగ రద్దీని నియంత్రించడానికి, ప్రయాణం సులభతరం చేయడానికి రైల్వే మంత్రిత్వ శాఖ ప్రయోగాత్మకంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో ప్రయాణికులకు బేస్ చార్జీలపై 20 శాతం తగ్గింపు లభిస్తుంది. ఇరువైపుల ఒకే తరగతి, ఒకే మార్గంలో ప్రయాణించే వారికి మాత్రమే వర్తిస్తుంది. ఉదాహరణకు విశాఖ నుంచి సికింద్రాబాద్‌కు వెళి, తిరిగి సికింద్రాబాద్ నుంచి విశాఖ వచ్చే వారికి ఒకే క్లాస్‌కు మాత్రమే వర్తిస్తుంది. అయితే తొలి ప్రయాణం అక్టోబరు 13 నుంచి 26 మధ్య, తిరుగు ప్రయాణం నవంబరు 17 నుంచి డిసెంబరు ఒకటి మధ్య చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా ప్రయాణికుల రానుపోను వివరాలు ఒకే విధంగా ఉండాలి, మార్పులు జరిగితే రాయితీ వర్తించదు. శాశ్వత ప్రాతిపదికన నడుస్తున్న రైళ్లతోపాటు ప్రత్యేక రైళ్లకు వర్తిస్తుందని అధికారులు పేర్కొన్నారు. రానుపోను టికెట్లు ఆన్‌లైన్/ ఆఫ్ లైన్‌లో తీసుకోవచ్చు. ఒకవైపు ప్రయాణాన్ని ఆన్‌లైన్‌లో, తిరుగు ప్రయాణం ఆఫ్‌లైన్‌లో చేస్తే రాయితీ వర్తించదు. ఈ పథకం కింద బుక్ చేసుకున్న టికెట్లకు చార్జీలు వాపసు ఇవ్వరు. అనివార్య కారణాల వలన టికెట్ రద్దు చేసుకున్నా వాపసు రావు. రైలు ప్రయాణ కూపన్లు, వోచర్ ఆధారిత బుకింగ్, పాస్‌లు, పీటీవోలు చెల్లవని స్పష్టం చేశారు.

## నేటి నుంచి దసరా స్పెషల్స్





- 300 బస్సులు నడపనున్న ఆర్టీసీ

-6లో

## ఆటో డ్రైవర్ సేవలోకు స్పందన

30 వేలకు పైగా దరఖాస్తులు

- 1,850 అప్లికేషన్లపై అభ్యంతరాలు
- నివృత్తి చేసిన రవాణా శాఖ అధికారులు



విశాఖపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆటో, క్యాబ్ వాహన యజమానులను ఆదుకునేందుకు ప్రభుత్వం అమలు చేయనున్న ఆటో డ్రైవర్ సేవలో (వాహన మిత్ర) పథకం కోసం జిల్లా వ్యాప్తంగా 30 వేలకు పైగా దరఖాస్తులు అందినట్టు రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు. సొంతంగా ఆటో, మ్యాక్సీ క్యాబ్ కలిగిన వారికి చేయూతనిచ్చేందుకు వీలుగా ఆటో డ్రైవర్ సేవలో పథకం కింద ప్రతి ఏటా రూ.15 వేలు అందిస్తామని ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆటో, క్యాబ్ యజమానులకు దసరా రోజున పథకం కింద డబ్బు జమ చేస్తామని ఇటీవల ప్రకటించారు. ఇందులో భాగంగా అర్హులైనవారంతా ఈనెల 17 నుంచి 19 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు కలెక్టరేట్‌లోని వార్డు సచివాలయ పర్యవేక్షణ విభాగానికి చేరుతాయి. వాటిలో అభ్యంతరాలుంటే రవాణాశాఖ అధికారుల పరిశీలనకు పంపిస్తారు. ఈ మేరకు 1,850 దరఖాస్తులు రవాణాశాఖ అధికారుల లాగిన్‌కు వెళ్లాయి. వారు వాటిని క్షుణ్ణంగా పరిశీలించి కలెక్టరేట్‌లోని అధికారుల వ్యక్తం చేసిన అభ్యంతరాలపై వివరణ ఇస్తూ తిరిగి పంపారు. వాహన మిత్ర పథకం కోసం జిల్లా వ్యాప్తంగా 30వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్టు అంచనావేస్తున్నారు. సోమవారం నాటికి ఈ సంఖ్యపై స్పష్టత వస్తుందని చెబుతున్నారు.

## పెందుర్తిలో ఆగని భూ ఆక్రమణలు

- చెరువులనూ వదలని కబ్జాదారులు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు


పెందుర్తి సర్వేనంబరు 113లోని ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు

విశాఖపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలకు తెరపడడం లేదు. కూటమిలో ఒక పార్టీకి చెందిన నేతలు, ఒకరిద్దరు కార్పొరేటర్లు, వారి బంధువులు ఆక్రమణదారులను ప్రోత్సహిస్తున్నారు. కొన్నిచోట్ల కూటమి నేతలే ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఓ కార్పొరేటర్ బంధువు ప్రభుత్వ స్థలంలో అక్రమంగా కల్యాణ మండపం నిర్మించి, కోర్టు నుంచి స్టే పొందారు. ఇళ్లు లేని పేదల పక్షాన ఉంటున్నామని మరికొందరు నాయకులు ఏకంగా చెరువులనే ఆక్రమించుకున్నారు. చినముషిడివాడ సమీపంలోని సర్వే నంబరు 113లో ప్రభుత్వ బంజరును ఆక్రమించుకుని కల్యాణమండపం నిర్మించారు. అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాల్సిన రెవెన్యూ శాఖ తొలుత పూర్తిగా నిద్రపోయింది. ఆ తరువాత నోటీస్ ఇస్తే సదరు ఆక్రమణదారుడు కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. దానిని అనుకుని ఉన్న ప్రభుత్వ స్థలానికి ఇటీవల మరొకరు

... మిగతా 6వ పేజీలో


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

## 500 మందికి వైద్య పరీక్షలు

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు గోశాల కూడలిలో స్థానిక ఎస్‌వీఎల్‌ఎన్ వాకర్స్ క్లబ్ సారథ్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ ద్వారకానాథ్, గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ సురేశ్ ప్రారంభించారు. పలు ప్రైవేటు ఆసుపత్రులకు చెందిన వైద్యులు 500 మంది రోగులను పరీక్షించి, మందులు అందజేశారు.ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు మురళీ, కార్యదర్శి బీఎన్ రావు, అడ్వైజర్ ఎస్. రామకృష్ణ, క్లబ్ కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

## పితృ దేవతలకు పూజలు


పిండాలకు పూజలు చేస్తున్న దృశ్యం

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):మహాలయ అమావాస్య పురస్కరించుకుని పలువురు తమ పితృదేవతలకు పిండ ప్రదానాలు చేశారు. వరాహ పుష్కరిణి ఒడ్డున స్థానిక పురోహితుల సారథ్యంలో పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది పిండాలకు పూజలు చేసి, వాటిని పుష్కరిణి జలాల్లో విడిచిపెట్టారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి మానవేంద్రనాథ్‌రాయ్ కూడా పుష్కరిణిలో స్నానం చేసి, తమ పితృ దేవతల పేరున పిండ ప్రదానాలు చేశారు.

## చిరు వ్యాపారుల నిరసన


నిరసన తెలుపుతున్న చిరు వ్యాపారులు

కొమ్మాది, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బడ్డీలు తొలగించి, తమ బతుకులను రోడ్డున పడేయడం అన్యాయమని కొమ్మాది ఏరియా చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వారు చలో జీవీఎంసీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఆటో జాత నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్మాది మాస్టర్ ప్లాన్ రోడ్డులో నిరసన వ్యక్తం చేశారు.సీఐటీయూ నాయకులు డి. అప్పలరాజు, రాజ్‌కుమార్ మాట్లాడుతూ బడ్డీలు తొలగించి, పేదల బతుకులను నాశనం చేసేలా జీవీఎంసీ కమిషనర్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పేదల జీవితాలతో చెలగాటం ఆడడం సరికాదని హెచ్చరించారు.సోమవారం జరిగే చలో జీవీఎంసీ కార్యక్రమాన్ని అన్ని వర్గాల వారు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

కొమ్మాది, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అన్నంరాజునగర్‌లో ఉన్న అష్టలక్ష్మీ దేవాలయంలో సోమవారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకుడు చామర్తి శ్రీధర స్వామి తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ కుంకుమార్చనలు, 29న సామూహిక అక్షరాభ్యాసం, 2న శమీ పూజ జరగనున్నట్టు చెప్పారు.

**పద్మనాభం :** మండలంలోని పలు గ్రామాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.పద్మనాభం, మద్ది, పొట్నూరు. విజయానందపురం ఇప్పటికే మండపాల నిర్మాణం పూర్తయింది. తొమ్మిది రోజుల పాటు తొమ్మిది అలంకారాలతో అమ్మవారిని పూజించనున్నారు. కోరాడ పంచాయతీ గెద్దపేటలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సహిత లక్ష్మీ గణపతి ఆలయంలో కొలువైన ఉమామహేశ్వరి అమ్మవారికి తొలిరోజు గణపతి పూజ, అమ్మవారి ప్రతిష్ఠ, నవ కలశ ఆవాహనాలు, అష్టోత్తర నీరాజనం మంత్ర పుష్పాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

**భీమునిపట్నం :** పట్టణంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పాత బస్టాండ్‌లో నూకాంబికా ఆటో వర్కర్స్ సంఘం, గొల్లవీధి శ్రీకృష్ణ జంక్షన్‌లో, కీటిన్‌పేట ప్రాంతాల్లో మండపాలు నిర్మించారు.

## రహదారి ఆక్రమణపై ఫిర్యాదు

సాగర్‌నగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ స్వర్ణభారతి నగర్‌లో రహదారి ఆక్రమించి, భవనం నిర్మిస్తున్నారని మాజీ సర్పంచ్ చెన్నా దాసు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాలనీలో ఈడబ్ల్యూఎస్ స్కీమ్ రివైజ్డ్ ఎల్‌పీ నెంబరు 90/97 లేఅవుట్‌లో 40 అడుగుల రహదారిగా చూపించారని, ఈ రహదారిని 5 అడుగుల మేర ఆక్రమించి ఇల్లు నిర్మిస్తున్నారని తెలిపారు. ఈమేరకు మధురవాడ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.

## విద్యారంగ సమస్యలపై బస్సు జాత



సమావేశంలో పాల్గొన్న సమితి సభ్యులు

విశాఖపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అక్టోబరు 14 నుంచి నవంబరు 14 వరకు శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బస్సు జాత నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు తెలిపారు. ఆదివారం అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ 10 వైద్య కళాశాలలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## నిత్యాన్నప్రసాద పథకానికి విరాళం

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నప్రసాద పథకానికి గాజువాక ప్రాంతానికి చెందిన బి. శ్రీనివాసరావు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని నగదు రూపంలో పీఆర్‌ఓ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు ఆదివారం ఆయన అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.


దాతకు బాండ్ అందజేస్తున్న అధికారులు


సందర్శకులతో సందడిగా ఉన్న రుషికొండ బీచ్

## తీరంలో పర్యాటకుల సందడి

సాగర్‌నగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌లు సందర్శకులతో ఆదివారం కిటకిటలాడాయి. గత కొద్ది రోజులుగా ఎండల తీవ్రత, ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో పాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొందరు ఇసుక తిన్నెల్లో ఆటలు ఆడగా, మరికొందరు బోటు షికార్ చేస్తూ.. ఇంకొందరు సముద్రంలో స్నానాలు చేస్తూ ఉల్లాసంగా గడిపారు. కాగా సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉండడంతో బీచ్ రోడ్డులో పలుచోట్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. కొందరు రోడ్డు పక్కన వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల తరచూ ఈ సమస్య నెలకొంటోంది.

# టీడీపీ మండల కమిటీల జాబితా ప్రకటన


పద్మనాభం మండల నాయకులతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఆనందపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండలాల్లో టీడీపీ మండల కమిటీలను ఆదివారం ఎంపిక చేశారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి జాబితాలను విడుదల చేశారు. ఆనందపురం మండల అధ్యక్షుడిగా తర్లువాడ గ్రామానికి చెందిన తాట్రాజు అప్పారావును ఎంపిక చేశారు. ఉపాధ్యక్షుడిగా బోని మాజీ సర్పంచ్ సురాల సత్య వరప్రసాదరావు, జనరల్ సెక్రటరీగా ఎల్‌వీపాలెం ఎంపీటీసీ మాజీ సభ్యుడు లొడగల వెంకటరావును ఎంపిక చేశారు. ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా సాడి ముత్యాలరావు (బొడ్డపాలెం), యర్ర పైడిరాజు,రేగాని ఆదినారాయణ (రేగానిగూడెం), కార్యదర్శిగా మరుపిళ్ల ప్రసాదరావు (పెద్దిపాలెం), ఇల్లిపిల్లి సన్యాసిరావు (దుక్కవానిపాలెం), నిమ్మల అప్పలరాజు (పాలవలస), ట్రెజరర్‌గా లెంక రమణ (ముచ్చర్ల) నియమితులయ్యారు.

**పద్మనాభంలో..**

**పద్మనాభం :** టీడీపీ మండల నూతన కార్యవర్గం ఎంపికైంది. అధ్యక్షుడిగా కోరాడ రమణ (బీఆర్ తాళ్లవలస) మూడోసారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా సబ్బవరపు రాము (కొవ్వాడ), ప్రధాన కార్యదర్శిగా ఏ. గంగరాజు (రేవిడి) కార్యనిర్వాహక కార్యదర్శులుగా కె. వెంకటలక్ష్మి (కోరాడ), ఎస్. పైడినాయుడు (కృష్ణాపురం), పైల శ్రీనివాసరావు (లింగన్నపేట), కార్యదర్శులుగా కె. కృష్ణప్పడు (కొయ్యపేట), మహంతి అప్పలరమణ (పాండ్రంగి), పి. మోహన్ (తునివలస), కోశాధికారిగా జి. ప్రసాద్ (గెద్దపేట)ను నియమించారు. నూతనంగా ఎన్నికైన రమణతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నగరంలోని తన కార్యాలయంలో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంటా రవితేజ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, టీడీపీ మండ మాజీ అధ్యక్షుడు కె. నగేశ్‌కుమార్, ఐటీడీపీ నాయకుడు రొబ్బి సూర్యనారాయణ, భీమిలి మార్కెట్ కమిటీ డైరెక్టరు నందిని, పాండ్రంగి నీటి సంఘం అధ్యక్షుడు అప్పలరాజు, నాయకులు సుమంత్‌నాయుడు, చంద్రరావు పాల్గొన్నారు.

**భీమిలిలో...**

**భీమునిపట్నం రూరల్ :** మండల టీడీపీ అధ్యక్షుడిగా చిప్పాడ గ్రామానికి చెందిన సరగడ అప్పారావు నియమితులయ్యారు. ఉపాధ్యక్షుడిగా పరశురాముడు, ప్రధాన కార్యదర్శిగా పొట్నూరు రాము, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎల్లయ్య, సంతోష్, కొయ్య రామకృష్ణ, కార్యదర్శులుగా మనోజ్ సొంగ, కనకల సూరిబాబు, మజ్జి వెంకటరావు, కోశాధికారిగా మరగడ రఘురామిరెడ్డి ఎంపికయ్యారు. నూతనకార్యవర్గాన్ని ఎమ్మెల్యే గంటా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్‌బాబు,జడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు, దంతులూరి నరసింహమూర్తి రాజు, గుడ్లాల ఎల్లయ్య, తాతినాయుడు, పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలపై పోరాటం

- ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు వరహాలరాజు
- చిట్టివలసలో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న వరహాలరాజు

తగరపువలస,సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) :చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని సీజేఎం ఐఎన్‌టీయూసీ యూనియన్ అధ్యక్షుడు కాకర్లపూడి వరహాలరాజు అన్నారు. ఆదివారం చిట్టివలస జ్యూట్‌మిల్లులో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మిల్లు ప్రతినిధి లలిత్ మోహన్ మాట్లాడుతూ విశాఖ జాయింట్ లేబర్ కమిషనర్ వద్ద జరిగిన చర్చలను వివరించారు. అటాచ్‌మెంట్‌లో ఉన్న మిల్లు ఆస్తులను అమ్మకానికి అవకాశమిస్తే కార్మికుల మొత్తం అన్ని బకాయిలను క్లియర్ చేయగలమన్నారు. ఈ దశలో వరహాలరాజు జోక్యం చేసుకుని గతంలో కూడా ఇదేవిధంగా అవకాశం ఇస్తే రూ. 100 కోట్లకు పైగానే మిల్లు మిషనరీ, ఇతర ఆస్తులను అమ్మకాలు చేసి కార్మికులకు కేవలం రూ.36 కోట్లు మాత్రమే బకాయిలు చెల్లించారని తెలిపారు. మిగిలిన బకాయిల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. 2009లో మిల్లు మూతపడిందని, అప్పటి నుంచి ఇన్‌కమ్ అంటూ ఏమీ లేదు కనుక మరో అవకాశం ఇస్తే ఆస్తులను అమ్మకాలు జరిపి క్లియర్ చేస్తామని లలిత్ మోహన్ పునరుద్ఘాటించారు. వరహాలరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే, జిల్లా లేబర్ ఆఫీసరు సమక్షంలో మరోసారి చర్చలు జరిపి, అందరి అంగీకారంలో తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.అలాగే మారుపేరు కార్మికులు సుమారు 300 మంది ఉన్నారని, ఇప్పటివరకూ వారికి న్యాయం జరగలేదన్నారు. దీనిపై లలిత్ మోహన్ స్పందిస్తూ ఈ విషయమై కేంద్ర మంత్రితో చర్చలు జరిపామని, సమస్య పరిష్కారానికి మార్గాలు వెతుకుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి చిల్ల వెంకటరమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ జీరు వెంకటరెడ్డి, నాయకులు గురువులు, సరగడ శ్రీరామ్మూర్తి, సరగడ సూరిబాబు, ఆర్. నరసమ్మ, కొయ్య అప్పలచిట్టి, బొడ్డు నరసింగరావు, పోలిపల్లి ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.



## కళ్లద్దాలు పంపిణీ

ఎండాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ గోల్డ్ కోస్టులో లయన్స్ క్లబ్ సభ్యులు పేదలకు ఆదివారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. గతంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానికంగా నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో కళ్లద్దాలు అవసరమైన వారిని గుర్తించారు. వారందరికీ కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ధర్మారావు, బలరామకృష్ణ, సంతోశ్, గోల్డ్ కోస్టు అపార్ట్‌మెంట్స్ ప్రతినిధులు పూర్ణచంద్రరావు, పోలాకి తిరు పాల్గొన్నారు.

## సాగర్‌నగర్ సంక్షేమ సంఘానికి ఎన్నికలు


ఓటింగ్ కోసం క్యూలో ఉన్న కాలనీవాసులు

సాగర్‌నగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్ సంక్షేమ సంఘానికి ఆదివారం ఎన్నికలు జరిగాయి. సంఘానికి 30 ఏళ్లుగా ఏకగ్రీవంగా లేదా మూజివాని ఓట్లతో అభ్యర్థులను ఎన్నుకునేవారు. కానీ ఈసారి జరిగిన ఎన్నికల్లో ముగ్గురు పోటీపడ్డారు. వైసీపీకి అభ్యర్థి లేకపోగా, కూటమి నుంచి ముగ్గురు పోటీ చేశారు. మొత్తం ఓట్లు 550 పోల్ కాగా బి.ప్రతాప్‌కు 173, పల్లవి మోహన్‌రావుకు 43, బొడ్డు శ్రీనివాసరావుకు 210 ఓట్లు వచ్చాయి. సాగర్‌నగర్ ఎస్‌బీఐపై ఉన్న భవంతిలో ఓటింగ్ ప్రక్రియ చేపట్టారు.

## ఆనందపురంలో పూర్వ విద్యార్థుల కలయిక


పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు

ఆనందపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003 - 2004లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను స్మరించుకుంటూ ఒకరికొకరు పలకరించుకుని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్యా బుద్ధిలు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎంఎస్ ప్రసాద్, పి.కామేశ్వరరావు, సత్యారావు, బులుసు వెంకటేశ్వరరావు, జానీ, శివనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 'దుకాణాల తొలగింపు అన్యాయం'


సంఘీభావం తెలుపుతున్న అఖిలపక్షం నాయకులు

మధురవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ముందస్తు సమాచారం లేకుండా మధురవాడ పరిసరాల్లో చిరు వ్యాపారులు, స్ట్రీట్ వెండర్ల దుకాణాలను తొలగించడం అన్యాయమని పలు పార్టీల నాయకులు పేర్కొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం అఖిలపక్షం నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొట్ట కూటి కోసం ఇతర జిల్లాల నుంచి వలస వచ్చి చిల్లర వ్యాపారాలు చేసుకునే వారి దుకాణాలను తొలగించడం అన్యాయమన్నారు. కేంద్రం దుకాణాల ఆధారంగా వ్యాపారులకు ముద్ర రుణాలు ఇచ్చిందని, ఇప్పుడు వారు రుణాలు ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. జీవీఎంసీ పరిధిలో హాకర్ జోన్లు ఏర్పాటు చేసి, వ్యాపారాలు కోల్పోయిన వారికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ, సీపీఎం, వైసీపీ నాయకులతో పాటు ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐద్వా, మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.

## అప్పన్న సన్నిధిలో అమావాస్య పూజలు


బేడా మండపం తిరువీధిలో స్వామివారు

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బాద్రపద అమావాస్య పురస్కరించుకుని వరాహలక్ష్మీనృసింహస్వామి దేవళంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం రాజభోగం నివేదన వేళ సుదర్శన పెరుమాళ్‌ను పల్లకిలో ఉంచి మాడవీధుల్లో ఊరేగిస్తూ అష్టదిక్పాలకులకు పూజలు, నివేదనలు జరిపారు. సాయంత్రం పవళింపు తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఉంచారు. ఆస్థాన పండితుల వేదమంత్రోచ్చారణలు, విద్వాంసుల నాదస్వరాలపనలు నడుమ స్వామివారి బేడా తిరువీధి వైభవంగా నిర్వహించారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


నర్సాపురంలో ప్రచారం చేస్తున్న ప్రతినిధులు

పద్మనాభం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తునివలస, నర్సాపురం గ్రామాల్లో ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద ప్రవచించిన అంశాలపై రూపొందిచిన సాహిత్యాన్ని ప్రజలకు పరిచయం చేశారు. కార్యక్రమంలో విజయరాంపురం ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు త్రినాథరావు, భవాని, రమాదేవి, భారతి, సత్యం, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.


రోగులను తనిఖీ చేస్తున్న వైద్యులు జగన్నాథరావు, మోహన్

## 80 మందికి హోమియో మందులు పంపిణీ

భీమునిపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కలిగొట్ల స్నిగ్ధశ్రీ దేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో 80 మందికి మందులు అందించారు. చిన్నబజారు డచ్‌రోడ్‌లోని ఆ సంస్థ కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ శిబిరాన్ని సంస్థ ఛైర్మన్ శ్రీరామ్ ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో హోమియో వైద్యులు టి. జగన్నాథరావు, టిజె మోహన్, సంస్థ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

## తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలకు ఇద్దరి ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న పుష్పలత, తదితరులు

కొమ్మాది, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు మధురవాడ ఆనంద్ తైక్వాండో అకాడమీకి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు.బాలికల అండర్ 17 కేటగిరీలో (49 కిలోల విభాగం) కొమ్మాదిలోని కృష్ణ వికాస్ విజయం స్కూల్ విద్యార్థి ఎ. భాగ్యశ్రీ, బాలురు అండర్ 14 కేటగిరీలో (35 కిలోల విభాగం) పీఎంపాలెం మాలతాంబా విద్యానికేతన్ విద్యార్థి కె. తోషన్ ఎంపికయ్యారు. గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వ ర్యంలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో వారు ప్రతిభ చూపారు. విజేతలను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎ. పుష్పలత, పిడిలు చిన్నదేవుళ్లు, నాగేశ్వరరావు అభినందించారు.

# నేటి నుంచి దసరా స్పెషల్స్

**ద్వారకాబస్‌స్టేషన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** ఆర్టీసీ విశాఖ రీజియన్ పరిధిలో సోమవారం నుంచి దసరా స్పెషల్స్ రోడ్డెక్కనున్నాయి. ప్రయాణికుల డిమాండ్ ఆధారంగా వీటిని నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్, విజయవాడ, కాకినాడ, రాజమండ్రి, భీమవరం వంటి దూరప్రాంతాలకు 100 బస్సులు, జోనల్ పరిధిలోని శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం, విజయనగరం, బొబ్బిలి, సాలూరు, రాజాం తదితర ప్రాంతాలకు 200 బస్సులు సిద్ధం చేశారు. షెడ్యూల్ సర్వీసుల సీటింగ్ సామర్థ్యానికి మించి ప్రయాణికుల డిమాండ్ ఉంటే ద్వారకాబస్‌స్టేషన్, మద్దిలపాలెం కాంప్లెక్సుల నుంచి వీటిని నడుపుతామని అధికారులు తెలిపారు. దూరప్రాంతాలకు గరుడ, గరుడప్లస్, డీలక్స్, ఆల్ట్రాడీలక్స్ బస్సులు నడుపుతారు.

**జోనల్ పరిధిలో స్త్రీశక్తి బస్సులు**

విశాఖ నుంచి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని పలుప్రాంతాలకు ఆర్డినరీ, పల్లెవెలుగు, ఆల్ట్రాపల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రోఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. విశాఖ నుంచి శ్రీకాకుళం, పలాస, టెక్కలి, ఇచ్ఛాపురం, సోంపేట, రాజాం, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు ప్రాంతాలకు ఉచితంగా ప్రయాణించేందుకు మహిళలు ఆసక్తి చూపే అవకాశం ఉందని భావించిన అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు చేశారు.

# లే అవుట్‌లలో దొంగలు!

... 5వ పేజీ తరువాయి

లేఅవుట్ నుంచి ఇసుక, సిమెంట్‌ను సమీప గ్రామాల ప్రజలు తక్కువ ధరకు కొనుగోలుచేశారనే ఆరోపణలున్నాయి. శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చే ఇసుకలోడ్ లేఅవుట్‌కు వెళ్లి అక్కడి నుంచి తిరిగి సమీప గ్రామాలకు తరలిపోతోందని రామవరం ప్రాంతానికి చెందిన నాయకులు చెబుతున్నారు. పద్మనాభం మండలం విజయరాంపురం లేఅవుట్‌లో సుమారు 300 టన్నుల ఇనుము తక్కువగా ఉందని రెండు నెలల క్రితం ఇన్‌చార్జి ఏఈ హౌసింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇప్పటికీ లెక్కలు తేల్చలేదు. తాజాగా తునివలసలో ఇసుక ట్రాక్టర్‌తో తరలించడంపై ఫిర్యాదుచేయాలని ఈఈ సూరిబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. మెటీరియల్ తరలింపు బయటకు పొక్కితేనే పోలీసులకు ఫిర్యాదుచేయడం, సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇస్తున్నారు. లేదంటే పట్టించుకోవడం లేదు.

**అవసరానికి మించి వాడినా...**

భారీగా ఇళ్లు నిర్మిస్తున్న సంస్థ అవసరానికి మించి ఇనుము వినియోగించినట్టు తేలినా అధికారులు స్పందించడం లేదు. ఇద్దరు ముగ్గురు ఏఈలు ఆయా లేఅవుట్‌లలో చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలున్నాయి. రాజకీయంగా పలుకుబడి ఉండడంతో ఉన్నతాధికారులు కూడా వారిపై చర్యలు తీసుకోలేదనే వాదన ఉంది. వర్షాకాలం కావడంతో అన్నిలేఅవుట్‌లలో నిర్మాణాలు, ఇసుక సరఫరా నిలిచిపోయింది. నిల్వ మేరకు పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మెటీరియల్ నిల్వ లెక్కలు తేల్చాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు చేసిన నిర్మాణాలకు సరిపడా ఇనుము, ఇసుక, సిమెంట్ వినియోగించారా? తేడాలున్నాయా? ప్రభుత్వం సరఫరాచేసిన స్టాకులో ఎంత వినియోగించారు? తేల్చాలని ఆదేశించారు. దీంతో లేఅవుట్‌ల వారీగా లెక్కలు తేల్చేందుకు అధికారులు సన్నద్ధమవడంతో అక్రమార్కుల్లో ఆందోళన నెలకొంది. దీంతో వారంతా కాకిలెక్కలు వేసే పనిలో ఉన్నారని హౌసింగ్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

# పెందుర్తిలో ఆగని భూ ఆక్రమణలు

... 5వ పేజీ తరువాయి

ప్రహరీగోడ నిర్మించారు. అప్పటివరకూ మౌనంగా ఉన్న రెవెన్యూ సిబ్బంది ఆ తరువాత అడ్డుకోగా 1980లో అప్పటి కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్ కాపీని చూపిస్తున్నారు. ఆ స్థలం ఇప్పటికీ రెవెన్యూ రికార్డులో ప్రభుత్వ భూమిగానే ఉంది. కాగా పెందుర్తిలో కొన్ని చెరువులను ఆక్రమించుకుని పలువురు ఇళ్లు నిర్మించుకోగా, సుజాతనగర్ టీచర్స్ లేఅవుట్‌లో గెడ్డలు, వాగులు, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయి. చినముషిడివాడ చెరువులో ఆక్రమణ తొలగింపునకు వెళ్లిన రెవెన్యూ సిబ్బందిపై స్థానికులు దాడికి పాల్పడ్డారు. పెందుర్తి మండలంలో ఆక్రమణల తొలగింపునకు పోలీసుల నుంచి సహకారం అందడం లేదనే వాదన వినిపిస్తోంది. దీనికి కూటమి నేతల ఒత్తిడే కారణమని చెబుతున్నారు.

## ఇంజనీరింగ్‌లో అక్రమాలపై కమిషనర్ దృష్టి

... 5వ పేజీ తరువాయి

కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులు కుమ్మక్కవుపోతారనే ఆరోపణలతో పాటు పనుల్లో అక్రమాలకు చెక్‌పెట్టినట్టవుతుందన్నది కమిషనర్ ఉద్దేశం. ఒకవేళ ఏదైనా ఫైల్‌ను చూసినపుడు కమిషనర్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు ఎవరైనా ర్యాండమ్ తనిఖీల్లో ఏదైనా లోపం కనిపిస్తే సంబంధిత ఎమినిటీ సెక్రటరీ, ఏఈ బాధ్యత వహించాల్సి ఉంటుంది. దీనివల్ల అవినీతి ఆస్కారం లేకుండా పనిచేసేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

## తిరుమల బ్రహ్మోత్సవాలకు వ్యాఖ్యాతగా రాంభట్ల

సీతమ్మధార, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 24 నుంచి ఆరంభమయ్యే తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో విశాఖకు చెందిన రాంభట్ల నృసింహశర్మ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తారు. ఈ నెల 25 రాత్రి 7 గంటలకు మొదలయ్యే హంస వాహనానికి, 26న ఉదయం 8 గంటలకు జరిగే సింహ వాహనానికి రాంభట్ల ప్రత్యక్ష వ్యాఖ్యానం చేస్తారు.

# పిచ్చుకు గూడులా విద్యుత్ తీగలు



విద్యుత్ స్తంభానికి లెక్కకు మించి ఉన్న విద్యుత్ కనెక్షన్లు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 16వ వార్డులోని పాత వెంకోజీపాలెం యాదవ వీధి చివర నున్న ఏ/4 విద్యుత్ స్తంభానికి ఉన్న విద్యుత్ తీగలు పిచ్చుక గూడును తలపిస్తున్నాయి. లెక్కకు మించి కనెక్షన్లు ఉండడంతో ఈ పరిస్థితి నెలకొంది. కొన్నిసార్లు పెద్ద గాలులు వీచినప్పుడు విద్యుత్ స్తంభం కాస్త ఊగుతుండడంతో స్థానికులు భయాందోళనలకు లోనవుతున్నారు. అసలే మూడు అడుగుల మార్గం, అందులోనూ ఒకే విద్యుత్ స్తంభానికి అధికగా కనెక్షన్లు ఉండడంతో స్తంభానికి ఆనుకుని ఉన్న నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విద్యుత్ స్తంభం నుంచి కొన్ని విద్యుత్ కనెక్షన్లనుసమీపంలోనున్న మరో స్తంభానికి మార్చడం కానీ, ఈ ప్రాంతంలోనే మరో విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయడం కానీ చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## జెండా పోల్ తొలగించడంపై వైసీపీ నిరసన

» వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం



వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న వైసీపీ నేతలు

ఆరిలోవ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద గల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ఆనుకొని ఉన్న పార్టీ ఐరన్ జెండా పోల్‌ను ఒక కాంట్రాక్టర్ తొలగించడం దుర్మార్గపు చర్య అని వైసీపీ 13వ వార్డు అధ్యక్షుడు వెంకట్, సీనియర్ నాయకుడు వానలపల్లి ఈశ్వరరావు తీవ్రంగా ఖండించారు. జెండా పోల్‌ను తొలగించడంపై పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. వైఎస్ఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఆరిలోవ పోలీసులు చేరుకొని ఆందోళనకారులను చెదరగొట్టారు.

## సినిమా గైడ్

- **మిరాయి** : జగదాంబ, మెలోడీ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కింధపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక).
- **అర్జున్ చక్రవర్తి** : రమాదేవి,
- **మదరాసి** : శ్రీకన్య
- **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
- **కూలీ** :వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 12, టమాటా 26, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 24, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 44, దొండకాయలు 34, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 48, అల్లం (పాతది) 70, బరబాటి 32, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 32, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 38, చిలగడదుంపలు 38, కంద 50, దేముడు చిక్కుడు 708, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

| కోడిగుడ్లు (నెక్) | (వంద - రూ.లలో) |
|---|---|
| విశాఖపట్నం | 540 |
| విజయనగరం | 544 |
| శ్రీకాకుళం | 544 |

| చికెన్ ధరలు | బ్యాగ్ |
|---|---|
| రైతు ధర | 130 |
| లైవ్ ధర | 150 |
| విత్ స్కిన్ | 270 |
| స్కిన్‌లెస్ | 280 |

# కళావిహీనంగా బీచ్ పార్కు

» నిర్వహణ లోపంతో ఆహ్లాదం కనుమరుగు » పాడవుతున్న క్రీడా సామగ్రి
» కెరటాల దెబ్బకు కొట్టుకుపోతున్న పార్కు స్థలం

బీచ్ రోడ్డు, సెప్టెంబర్ 17, (ఆంధ్రజ్యోతి) : ఆహ్లాదానికి పెట్టిందే పేరు ఆర్కే బీచ్. విశాఖ నగరానికి వచ్చేవారు ఆర్కే బీచ్‌ను కచ్చితంగా చూడాలని తపిస్తుంటారు. తీరం అందాలను, అలల సోయగాలను వీక్షించాలని తహతహలాడుతుంటారు. సందర్శకులకు చక్కని పర్యాటక కేంద్ర ఆర్కే బీచ్. తీరం పొడవునా ఏర్పాటు చేసిన వివిధ ఆకారాలు, ఆకృతులు, జంతువుల బొమ్మలు సందర్శకులను అమితంగా ఆకట్టుకుంటాయి. చిన్నారులైతే తెగ ముచ్చట పడతారు.



టాప్ లేకుండా పోయిన జారుడు బల్ల

అయితే ఇటీవల నిర్వహణ లేకపోవడం, ఉన్నతాధికారుల పట్టించుకోకపోవడంతో చిన్నారుల ఆహ్లాదానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పిల్లలు ఆడుకునే పార్కులో క్రీడా సామగ్రి అక్కడక్కడా విరిగిపోయి రూపం కోల్పోయాయి. జారుడు బల్ల పూర్తిగా ధ్వంసమైంది. ఇటీవల తీరం కోతకు గురవడంతో పిల్లలు ఆడుకునే కొన్ని వస్తువులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అష్టకష్టాలు పడి ఇనుప కడ్డీలపై నుంచి పిల్లలు ఎక్కుతున్నారు. పచ్చదనం మచ్చుకైన కనిపించదు. పర్యాటకంగా ఎంతో పేరొందిన తీరం ప్రస్తుత పరిస్థితి చూస్తోంటే దయనీయంగా తయారైంది. దీని గురించి పట్టించుకునే వారే కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్కే బీచ్ పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



సముద్రం ఆటుపోటుల సమయంలో కోరింతకు గురవుతున్న పార్కు

# కాలేజీ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలి

» కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌బాబు



కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌బాబుతో పూర్వ విద్యార్థులు

మద్దిలపాలెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌బాబు కోరారు. కళాశాలలో ఆదివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిగ్రీ, పీజీ కళాశాలల్లో నిర్వహించే కార్యక్రమాలకు పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇదే పద్ధతిలో మరింత సహాయసహకారాలు అందించాలని కోరారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ మాట్లాడుతూ కృష్ణా కళాశాలలో చదివి బయటకు వెళ్లిన వేలాదిమంది విద్యార్థులు రీ-యూనియన్ ఏర్పాటు చేస్తామన్నారు. తమ సంఘం ద్వారా విద్యార్థులకు ఆదుకునే కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయ, అధ్యాపకులు ఉమామహేశ్వరరావు, పూర్వ విద్యార్థులు మోహన్‌రెడ్డి, వెంకటరమణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేత




స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులు

రామ్‌నగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన ప్రతిభ గల పేద విద్యారులకు ఎల్ ఏంజెల్స్ అసోసియేషన్ స్కాలర్‌షిప్‌లను అందజేసింది. ఆదివారం రామ్‌నగర్ లోని హోటల్ రాక్‌డేల్‌లో రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్ర మంలో జపాన్‌కు చెందిన ఎల్ ఏంజెల్స్ ఇంట ర్నేషనల్ వలంటీర్స్ అసోషియేషన్ ప్రతినిదులు చేతులు మీదుగా విద్యార్థులకు రూ.3.6 లక్షల స్కాలర్ షిప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు యోషి నగోరా మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదవడం ద్వారా తమ ఉజ్వలమైన భవిష్యత్‌కు బాటలు వేసుకొని దేశ అభ్యున్నతికి దోహదపడాలన్నారు. తమ అసోషియేషన్ ద్వారా విద్యార్థులకు ప్రతి సంవత్సరం అందిస్తున్న సహకారాన్ని కొనసాగిస్తామని తెలిపారు రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ పూర్వ అధ్యక్షుడు మండ జానకీరామ్ మాట్లాడుతూ ప్రతిభ గల పేద విద్యార్థులకు సహాయం అందించాలనే సంకల్పంతో స్కాలర్‌షిప్‌లు అందించడం అభినందనీయమని కొనియాడారు. సమావేశంలో రోటరీ పూర్వ గవర్నర్ ఎంసీ దాస్, అధ్యక్షుడు పిల్లలమర్రి రఘు, ప్రతినిధులు ఎస్.బెనర్జీ వి.పాండురంగరాజు, హనుమంతరావు, బి.బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్‌కు ‘భారతరత్న’ ఇవ్వాలి

» ఏపీ కాకతీయ కల్చరల్ అసోసియేషన్ డిమాండ్



మాట్లాడుతున్న ఏపీ కాకతీయ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి వెంకటసుబ్బరావు

మద్దిలపాలెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెంలోని కాకతీయ కన్వెన్షన్ హాలులో ఆదివారం కమ్మవారి సంఘాల పాలకవర్గం సభ్యుల ప్రాంతీయ సదస్సు జరిగింది. ఈ సమావేశంలో దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు ‘భారతరత్న’ పురస్కారం ఇవ్వాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఏపీ కాకతీయ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి వెంకటసుబ్బారావు, కార్యదర్శి బెజవాడ వెంకట్రావులు మాట్లాడుతూ గత అయిదేళ్లలో తమ సంఘాల ద్వారా చేసిన ఉద్యమాలు వివరించారు. చంద్రబాబును అరెస్టు చేసి 53 రోజులు జైలులో పెట్టినప్పుడు రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా, 73 దేశాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అమరావతి రైతుల ఉద్యమానికి పూర్తిస్థాయి మద్దతుగా నిలిచామన్నారు. ఎన్టీఆర్ హెల్త్‌యూనివర్సిటీ పేరు మార్పును ఖండించి ఉద్యమించామన్నారు. గత ప్రభుత్వం హయాంలో అయిదేళ్లు ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, సామాన్య ప్రజలు కూడా అనేక ఇబ్బందులు పడ్డారని, ఇలాంటి సమస్యలు అధిగమించాలంటే మనమంతా యూనిటీగా ఉండి ఉన్న సంఘాలను బలోపేతం చేసుకోవాలన్నారు. సమాజ నిర్మాణంలో కుల మతాలకు అతీతంగా కమ్మ సామాజిక పెద్దల ద్వారా 70 శాతానికి పైగా అభివృద్ధి జరిగిందని తెలిపారు. కాకతీయ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒరిశా రాష్ట్రాల్లో అనేక సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. త్వరలో రాష్ట్రంలోని అన్ని సంఘాలతో విజయవాడలో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో కాకతీయ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్మారెడ్డి రాంబాబు, కాకతీయ కన్వెన్సన్ కోశాధికారి అన్నే బాలాజీ, రాష్ట్ర సమాఖ్య కోశాధికారి కొర్లపాటి అయోధ్యరామారావు, కార్యదర్శులు తమ్మినేని రమేష్, పిన్నమనేని వెంకటేశ్వరరావు, సభ్యులు వసంతకృష్ణ, బూరుగుపల్లి వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

# కాలువల నిర్మాణంలో కానరాని నాణ్యత

» అధికారుల పర్యవేక్షణ కరువు

మద్దిలపాలెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డులో కాలువల నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయి. నాణ్యతకు తిలోదకాలిస్తూ పనులు చేపడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కువ ఇసుకలో తక్కువ సిమెంట్ వాడడంతో డ్రైనేజీ నిర్మాణాలునాసిరకంగా కనిపిస్తున్నాయి. మంగాపురం కాలనీ రహదారిలో బాగున్న కాలువలనే విరగ్గొట్టి కొత్త కాలువలను నిర్మాణం చేపట్టారు.

ఇక్కడ డ్రైనేజీకి పైపైన కాంక్రీట్ వేసి ప్లాస్టింగ్ చేసేశారు. దీంతో నిర్మాణం చేసిన పది రోజులకే పెచ్చులూడి అధ్వానంగా తయారయ్యాయి. డ్రైనేజీ కింద భాగంలో వేయాల్సిన కాంక్రీట్‌లో కూడా కక్కుర్తి పడుతున్నారు. ఫలితంగా చతురస్రాకారంలో ఉండాల్సిన కాలువలు యూ ఆకారంలో దర్శనమిస్తున్నాయి. దీని వల్ల మురుగు నీరు ప్రవహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి.

మంగాపురం కాలనీ ఎన్టీఆర్ విగ్రహం నుంచి పీతలవానిపాలెం వరకూ చేపడుతున్న కాలువల నిర్మాణం మరింత దారుణంగా ఉన్నాయి. ఇక్కడ కాలువ కింద భాగంలో అంగుళం ఎత్తు కాంక్రీట్ కూడా వేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైన పలుచగా కాంక్రీట్ వేసుకుంటూ వెళ్లిపోతున్నారు. కాంక్రీట్‌లో మట్టి కనిపిస్తూ పనులు మరింత నాసిరకంగా దర్శనమిస్తున్నాయి. పనులు పూర్తి కాకముందే డ్రైనేజీలు నాసిరకంగా కనిపిస్తున్నా పట్టించుకునే నాథుడే లేరు. దగ్గరుండి పనులు చేయించాల్సిన కాంట్రాక్టర్ అసలు కనిపించడం లేదు. ఇంజినీరింగ్ అధికారుల నుంచి కూడా పనులు పర్యవేక్షణ కరువైంది. దీంతో కాలువ నిర్మాణం ఇష్టానుసారంగా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పనుల నాణ్యత పర్యవేక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



మంగాపురంకాలనీలో నాసిరకంగా నిర్మాణం చేపట్టిన కాలువ



పీతలవానిపాలెంలోని కాలువ నిర్మాణంలో కింద భాగంలో అంగుళం కూడా వేయని కాంక్రీట్

# డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యం

» ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ మాధవ్

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ రహిత దేశమే లక్ష్యమని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఆదివారం బీచ్‌రోడ్డులో డ్రగ్స్ రహిత దేశమే ధ్యేయంగా నిర్వహిస్తున్న నమో యువ 3కే రన్‌ను బీజేపీ నగర అధ్యక్షుడు పరుశరామ్‌రాజు నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉండాలన్నారు.

వికసిత భారతవైపు అడుగులు వేసే అమృతకాలంలో యువత తప్పుదారి పట్టకుండా ఉండాలన్నారు. 2047 సంవత్సరానికి భారతదేశం ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా ఉండాలంటే ఆ బాధ్యతను యువత ముందుండి నడిపించాలన్నారు. నమో యువ 3కే రన్ నిర్వహించడం ద్వారా ఈ పరుగు దేశ అభివృద్ధి వైపు యువత పరుగులెత్తించేలా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. 3కే రన్‌లో యువత ఉత్సాహంగా పాల్గొని మద్దతు తెలియజేసింది.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్రమోహన్, కోశాధికారి నాగేంద్ర, ధనుష్, కోటేశ్వరరావు, ధోని నాగరాజు, వంశీయాదవ్, కొండ ప్రసాద్ పాల్గొన్నారు.

# ఏయూలో నేత్ర వైద్య శిబిరం



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మద్దిలపాలెం, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు ఎప్పటికప్పుడు నేత్ర పరీక్షలు చేయించుకోవాలని ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్ సూచించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఆదివారం శంకరఫౌండేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏయూ శతాబ్ధి ఉత్సవాల్లో భాగంగా బోధన, బోధనేతర సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించడానికి ఈ శిబిరం ఏర్పాటు చేశారన్నారు. అంధత్వ నివారణకు శంకర్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం ఉపకులపతికి వైద్యులు నేత్ర పరీక్షలు చేశారు. అలాగే 278 మంది సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ కె.రాంబాబు, జేడీ ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ అనురాధ, శంకర్ ఫౌండేషన్ డీజీఎం కె.బంగారురాజ్, డాక్టర్ నిఖిత, మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు చిరు వ్యాపారుల ‘చలో జీవీఎంసీ’

» దుకాణాల తొలగింపుపై నిరసనకు ఏఐటీయూసీ పిలుపు



కార్యక్రమం గురించి వివరిస్తున్న ఏఐటీయూసీ నేతలు

ఆరిలోవ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తరతరాలుగా చిన్న చిన్న వ్యాపారులు చేసుకొని జీవనం సాగిస్తున్న తమపై జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది పోలీసులను దగ్గర పెట్టుకొని బెదిరించి ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా దుకాణాలను తొలగించడం దుర్మార్గమని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పడాల రమణ విమర్శించారు. ఆదివారం ఆరిలోవలోని అంబేడ్కర్ జంక్షన్‌లో చిరు వ్యాపారస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూపకుండా ఈ విధంగా దుకాణాలను తొలగిస్తే చిరు వ్యాపారులు, వారి కుటుంబాలు ఏ విధంగా బతుకుతారని నిలదీశారు. వెంటనే జీవనాధారం కోల్పోయిన వారిని గుర్తించి హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో సోమవారం ప్రధాన కార్యాలయం సమీపంలో గల గాంధీ విగ్రహం వద్ద నిర్వహించనున్న ‘చలో జీవీఎంసీ’ కార్యక్రమానికి పెద్ద ఎత్తున చిరు వ్యాపారులు హాజరై తమ నిరసనను తెలపాలని పిలుపునిచ్చారు. వ్యాపారులపై అధికారుల జులుంను తిప్పికొట్టాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు పిల్లి వీర్రాజు, నాయకులు కరకల రమణ, రెడ్డి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

# కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు



కాల భైరవ స్వామి ఆలయం వద్ద భక్తుల సందడి

వెంకోజీపాలెం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెం శ్రీ గౌరీ జ్ఞానలింగేశ్వరాలయ సముదాయంలో వేంచేసి ఉన్న కాలభైరవ స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కాలభైరవ స్వామిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు డాక్టర్ బోర వెంకట రమణారెడ్డి, కాళ్ల వరహాలు, బోర యర్రాజీ రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# జూ పార్కులో సందర్శకుల సందడి



పులుల మోటు వద్ద సందర్శకుల తాకిడి

ఆరిలోవ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాలకు ఆదివారం సందర్శకులు అధిక సంఖ్యలో వచ్చారు. దీంతో పలు జంతువుల మోటు ల వద్ద సందడి నెలకొంది. సెల్ఫీలు, జంతువులకు ఫోటోలు తీస్తూ ఆటపాటలతో సందర్శకులు ఆనందంగా గడిపారు. సుమారు 3 వేల మంది సందర్శకులు వచ్చినట్టు క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. వీరి నుంచి రూ.2 లక్షల 39 వేల 850 ఆదాయం సమకూరినట్టు క్యూరేటర్ వెల్లడించారు.



జూలో సందర్శకుల తాకిడి

# రైతు బజార్‌ను సందర్శించిన మార్కెటింగ్ కమిటీ



రైతు బజార్‌ను సందర్శించిన మార్కెటింగ్ కమిటీ సభ్యులు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ రైతు బజార్‌ను మార్కెటింగ్ కమిటీ ఆదివారం సందర్శించింది. కమిటీ చైర్మన్ వింకు మహంతి చంద్రశేఖర్‌తో పాటు డైరెక్టర్లు బజారులోని వివిధ స్టాళ్లను పరిశీలించారు. రైతు బజార్‌లోని రైతులు, వినియోగదారులతో మాట్లాడి ఇక్కడి వసతి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై ఆరా తీశారు. రైతు బజార్ ఎస్టేట్ అధికారి వరహాలు, సహాయకులు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

# వెయ్యి ఆలయాలు కాదు, విద్యాసంస్థలు నిర్మించాలి : నాస్తిక సమాజం

ఆరిలోవ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని దళిత వాడలలో 1000 ఆలయాలను నిర్మాణం చేయాలని టీడీపీ చైర్మన్ ప్రకటించడం పట్ల భారత నాస్తిక సమాజం జాతీయ సమన్వయకర్త జె.రవి ఒక ప్రకటనలో ఆక్షేపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు టీటీడీ చైర్మెన్ ఈ విధంగా ప్రకటించడం అనాలోచిత చర్యఅని విమర్శించారు. ఇప్పటికే మన రాష్ట్రంలో అనేక గ్రామాల్లో దళితుల పట్ల వివక్ష కొనసాగుతోందని, ఈ పరిస్థితుల్లో 1000 ఆలయాలను నిర్మిసే ఆ వివక్ష మరింత పెరుగుతుందన్నారు. దాడులు మరింత పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. వాటికి బదులుగా రాష్ట్రంలో కార్పోరేటర్ స్థాయి బడులు, కాలేజీలు, హాస్టళ్ల నిర్మాణం చేస్తే దళిత, అణగారిన వర్గాలకు చెందిన విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. అప్పుడు విద్యార్థులు మేధావులుగా, మంచి నాయకులుగా తయారవుతారని అన్నారు. రాష్ట్రంలో అనేక స్కూళ్లలోని వసతిగృహాల్లో కనీస వసతులు లేవన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఈ తరుణంలో ఆలయాలు కంటే విద్యాసంస్థలు నిర్మిస్తే ప్రయోజనం ఉంటుందని సూచించారు.

# బాబోయ్...గుంతలు!

» ప్రధాన రహదారులపై రాకపోకలకు భయంభయం..

» వర్షం కురిసినప్పుడు పడుతూ లేస్తూ వాహనదారుల ప్రయాణం



కంచరపాలెం-తాటిచెట్లపాలెం వెళ్లే ప్రధాన రోడ్డుపై ఇలా..

మర్రిపాలెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారులు ఎక్కడికక్కడ గోతులమయమై ప్రమాదాలకు ఆస్కారంగా మారడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కంచరపాలెం నుంచి తాటిచెట్లపాలెం ప్రధాన రహదారి పలుచోట్ల పెద్ద పెద్ద గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. అదే రహదారిలో తాటిచెట్లపాలెం నుంచి కంచరపాలెం మధ్య తరచూ ప్రమాదాలు జరిగి వాహనదారులు గాయపడుతున్నారు. రాత్రి వేళ ఆ ప్రాంతం చీకటిగా ఉండటంతో రోడ్డుపై గోతులు కనిపించక వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. దొండపర్తి నుంచి రైల్వే న్యూకాలనీకి వెళ్లే రోడ్డుపై కూడా ఎక్కడకక్కడ గుంతలు పడి అధ్వానంగా తయారైంది. రైల్వేస్టేషన్ నుంచి జైల్‌రోడ్డుకు వెళ్లే రహదారి మరీ దారుణంగా తయారైంది. దీనితో ఆయా రహదారుల్లో తరచూ రాకపోకలు సాగించే వాహనదారుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. వర్షంనీరు గోతుల్లో చేరడంతో ఆయా రహదారుల్లో గోతులు ఉన్న విషయం తెలియని వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. నెలల తరబడి ప్రధాన రహదారులపై గోతులు దర్శనమిస్తున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు, వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



సీతంపేట గొల్లవీధిలో ముక్కలైన సీసీ రోడ్డు

**సీతంపేట గొల్లవీధిలో అధ్వానం**

సీతంపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గం పరిధి 25వ వార్డు సీతంపేట గొల్లవీధి, దుర్గాగణపతి ఆలయం సమీపంలో రాజేంద్రనగర్‌కి వెళ్లే రహదారి గోతులమయంగా మారి అధ్వానంగా తయారైంది. సీతంపేట గొల్లవీధిలో సీసీ రోడ్డు నిండా గోతులు కనిపిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యూజీడీ మ్యాన్ హోల్ చుట్టూ సిమెంట్ రోడ్డు పగులు వచ్చి నడవటానికి వీలులేకుండా ఉంది. వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోతుంది. సిమెంట్ రోడ్డు చిన్నదిగా ఉండటంతో పాటు యూజీడీ నుంచి మురుగు నీరు వస్తుండటంతో నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పొడుగునా గుంతలు ఉన్నాయి. సీతంపేట రాజేంద్ర నగర్ పెద్ద రహదారిలో యూజీడీ మ్యాన్‌హోల్స్ వద్ద మురుగు నీరు పొంగిపొర్లుతోంది. రహదారిలో గల యూజీడీ మ్యాన్ హోల్స్ అన్ని మరమ్మతులకు గురికావడంతో మురుగునీరు బయటకు వస్తుంది. దీంతో ఆ ప్రాంతం దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.



దుర్గాగణపతి ఆలయం సమీపంలో.



దొండపర్తి నుంచి రైల్వే న్యూకాలనీ వైపు వెళ్లే రోడ్డు తీరు ఇది

# డ్రగ్స్ రహిత దేశమే లక్ష్యం

» 3కె రన్‌లో ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



బీచ్‌రోడ్డులో పరుగిడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు




ప్లకార్డులు చూపుతున్న యువతులు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ రహిత దేశమే లక్ష్యమని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఆదివారం బీచ్‌రోడ్డులో డ్రగ్స్ రహిత దేశమే ధ్యేయంగా నిర్వహిస్తున్న నమో యువ 3కే రన్‌ను బీజేపీ నగర అధ్యక్షుడు పరుశరామ్‌రాజు నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉండాలన్నారు. వికసిత భారతవైపు అడుగులు వేసే అమృతకాలంలో యువత తప్పుదారి పట్టకుండా ఉండాలన్నారు. 2047 సంవత్సరానికి భారతదేశం ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా ఉండాలంటే ఆ బాధ్యతను యువత ముందుండి నడిపించాలన్నారు. నమో యువ 3 కే రన్ నిర్వహించడం ద్వారా ఈ పరుగు దేశ అభివృద్ధి వైపు యువత పరుగులెత్తించేలా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. 3కే రన్‌లో యువత ఉత్సాహంగా పాల్గొని మద్దతు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్రమోహన్, కోశాధికారి నాగేంద్ర, ధనుష్, కోటేశ్వరరావు, ధోని నాగరాజు, వంశీయాదవ్, కొండ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవుని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు



న్యాయమూర్తులకు స్వామి చిత్రాన్ని బహూకరిస్తున్న ఆలయవర్గాలు

మురళీనగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మురళీనగర్ ఎన్‌జీజీవోస్ కాలనీలో ఉన్న శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారిని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ రవి దర్శించుకున్నారు. ఆలయ వర్గాలు న్యాయమూర్తులకు స్వాగతం పలికారు. ప్రత్యేక హారతి పూజల్లో ఆలయ ప్రధాన అర్చకులు శేషస్వామి వేదాశీర్వచనం అందించి స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు. ఆలయ ఈఓ బి.ప్రసాద్, దాతలు పాల్గొన్నారు.

### తెన్నేటి, గురజాడలకు నివాళులు




నివాళులర్పిస్తున్న వాకర్స్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు

మాధవధార, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో ఆదివారం ప్రముఖ కవి గురజాడ అప్పారావు 163వ జయంతి వేడుకల్ని చేపట్టారు. ఆయనతో పాటుగా స్వాతంత్ర్య సమరయోధునిగా, రాజకీయ నేతగా పేరుగాంచిన తెన్నేటి.విశ్వనాథం 130వ జయంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలలతో నివాళులర్పించారు. వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు భానుప్రకాశ్, ప్రసాదరావు, జి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

## వైశాఖీస్పోర్ట్సు పార్కులో దసరా సంబరాలు

మాధవధార, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కులో ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం సమన్వయంతో దసరా మహిళా సాంస్కృతిక ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో సంబరాల్ని ఆరంభించారు. వైశాఖీ పార్కులో సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు సంబరాలు రెండు రోజులు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధి ఎం.సుజాత పేర్కొన్నారు. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలతో యువత, బాలల్ని భాగస్వాముల్ని చేసి ఉత్సవాలు నిర్వహించారు. సంప్రదాయ వాతావరణంలో నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. దసరా మహిళా సాంస్కృతిక ఉత్సవాలు సోమవారంతో ముగియనున్నాయి.

### తిరుమల బ్రహ్మోత్సవాలకు వ్యాఖ్యాతగా రాంభట్ల



సీతమ్మధార, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24 నుంచి ఆరంభమయ్యే తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలలో విశాఖకు చెందిన రాంభట్ల నృసింహశర్మ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తారు. ఈ నెల 25 రాత్రి 7 గంటలకు మొదలయ్యే హంస వాహనానికి, 26న ఉదయం 8 గంటలకు జరిగే సింహ వాహనానికి రాంభట్ల ప్రత్యక్ష వ్యాఖ్యానం చేస్తారు. ఈ అవకాశం రావడం పద్మాలుగోసారి అని రాంభట్ల తెలిపారు. ఎస్వీబీసీ వాహిక ద్వారా ప్రత్యక్ష ప్రసారం వీక్షించవచ్చన్నారు.

రాంభట్ల నృసింహశర్మ

## అసాంఘిక పనులకు పాల్పడితే బహిష్కరణ



రౌడీషీటర్లకు సూచనలిస్తున్న సీఐ వెంకటరమణ

సీతంపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్‌లో రౌడీ షీట్ ఉన్నవారు ఎక్కడైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే వారిని నివాస ప్రాంతం నుంచి బహిష్కరిస్తామని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ద్వారకా పోలీసుస్టేషన్ సీఐ వెంకటరమణ హెచ్చరించారు. స్టేషన్ పరిధిలో గల రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అందరికీ సూచనలు చేసి హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## గాంధీ సెంటర్‌లో ఘనంగా శాంతి ప్రతిజ్ఞ



శాంతి ప్రతిజ్ఞ చేస్తున్న అతిథులు, నిర్వాహకులు

సీతమ్మధార, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): లంకపల్లి బుల్లయ్య కళాశాల్లో గల గాంధీ సెంటర్ సెమినార్ హాలులో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ (ఐఎఆర్ఎఫ్) సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ శాంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా సర్వమత ప్రార్థనలు నిర్వహించి, గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐఎఆర్ఎఫ్ చైర్మన్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య బాలమోహన్‌దాస్, ఆచార్య కె.వి.రవిలు మాట్లాడారు. ఉగ్రవాదంతో పాటు దేశాల ఆయుధ శక్తి కూడా పెరుగుతున్నదని, దేశాల మధ్య నమ్మకం సన్నగిల్లుతుండడంతో, ఆ ప్రభావం అభివృద్ధిపై పడుతోందన్నారు. మూడో ప్రపంచ యుద్ధం రాకుండా ఐక్యరాజ్యసమితి చురుకైన పాత్ర నిర్వహించ వలసి ఉందన్నారు. అనంతరం సభ్యులు శాంతిని కాపాడుదాం, శాంతికి భంగం కలిగించేవారిని పోలీసు శాఖకు అప్పగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో హెస్సెన్, ప్రజ్ఞాన కుమార్, డాక్టర్ కేవీఎన్ మూర్తి, చాట్ల బాబురావు, బౌద్ధ బిక్షువులు కంటే బిక్షు, రాజధామ్ బిక్షు, బంగారురాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై బస్సు జాత




సమావేశంలో పాల్గొన్న సమితి సభ్యులు

అల్లిపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అక్టోబరు 14 నుంచి నవంబరు 14 వరకు శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బస్సు జాత నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు తెలిపారు. ఆదివారం అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ 10 వైద్య కళాశాలలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని, యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌పోస్టులు భర్తీ చేయాలని, ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పి.శేఖర్, భవాని, కె.మౌనిక, హేమానందం, కిరణ్, గ్రేస్ ప్రకాష్ పాల్గొన్నారు.

# ఎల్‌బీ పార్కులో మందుబాబుల హల్‌చల్!



అధ్వానంగా పార్కు లోపలి భాగం



మద్యం తాగి పడేసిన సీసాలు



ఇష్టానుసారంగా పడేసిన వ్యర్థాలు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పర్యవేక్షణ లోపం ఎలా ఉందో ఈ పార్కు చెబుతుంది. జనావాసాల్లో మద్యం మత్తులో వారు చేసే వీరంగం అంతా ఇంతా కాదు. ఎప్పుడు ఎలా వ్యవహరిస్తారో, ఎవరిని దూషిస్తారో, ఎవరిమీద పడతారో భయం. దీంతో స్థానికులకు నిత్యం ఆందోళనే. గ్రేటర్ 26వ వార్డు శాంతిపురం పరిధి లాల్‌బహదూర్‌శాస్త్రి నగర్‌లోని ఎల్‌బీ పార్కులో మందుబాబుల హల్‌చల్‌తో స్థానిక నివాసితులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ పార్కు మందుబాబులకు అడ్డాగా మారిపోయింది. చీకటి పడితే చాలు.. మందు బాబులు ఈ పార్కులో వాలిపోయి మద్యం తాగుతూ పరిసర ప్రాంతాల వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అర్ధరాత్రి వరకూ బాతాఖానీ కొడుతూ రాకపోకలు సాగిస్తున్న వారి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని పలువురు చెబుతున్నారు. వేరే ప్రాంతం నుంచి ఇక్కడకు వచ్చి పార్కులో మద్యం తాగి, సీసాలను అక్కడే పగులగొట్టేస్తున్నారు. మరునటి రోజు పార్కుకు వచ్చిన వాకర్లకు అవి గుచ్చుకుంటాయేమో తెలియని పరిస్థితి. రాత్రి సమయంలో పార్కు పక్కన ఉన్న రోడ్డుపై మహిళలు, యువతులు నడవాలంటేనే భయభ్రాంతులకు గురవుతున్నారు. తమ మానాన తాము వెళ్లిపోతున్నా చాలా అసభ్యకరంగా ప్రవర్తించి వేధింపులకు గురిచేస్తున్నారు. సాయంత్రం ఒంటరిగా మహిళలు బయటకు రావడానికి భయపడుతున్నారు. పిల్లలతో వెళ్లేవారు మందుబాబుల అరుపులు, కేకలు విని హడలిపోతున్నారు. గుంపుగా ఉండడంతో ఎదురు తిరిగితే ఏం చేస్తారో అన్న భయం. రాకపోకలు సాగిస్తున్న పాదచారులు, వాహన చోదకులను బెదిరింపులకు పాల్పడి వారి వద్ద ఉన్న వస్తువులు, డబ్బులు లాక్కుంటున్నారని, ఇదేమిటని ఎదురు ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారని వాపోతున్నారు. పోలీసులు స్పందించి ఈ ప్రాంతంలో రాత్రి పూట గస్తీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# ఈ బడ్డీలకు మినహాయింపు దేనికి?

మాధవధార, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కమిషనరు ఆదేశంతో నగరవ్యాప్తంగా ఆపరేషన్ లంగ్స్ 2.0 పేరుతో చేపడుతున్న ఆక్రమణల తొలగింపుపై వర్తకుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. కబ్జా పాలైన రోడ్డు మార్గాలకు విముక్తి లభించిందని కొందరు సంతోషం వ్యక్తం చేస్తున్నా, పేద వర్గాల దుకాణాలు నేలమట్టం కావడంపై అసహనం చెందుతున్నారు. పన్నులు కట్టించుకుని, బహిరంగ వేలంపాటలు పెట్టి మరీ ఆశీలు వసూళ్లకు అప్పజెప్పిన స్థలాల్లోనూ ఇపుడు ఆక్రమణలు అంటూ బడ్డీల్ని నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నారని కాంగ్రెస్, సీపీఎం నాయకులు, బాధిత వర్తకులు వాపోతున్నారు.

అమూల్ సేఫ్ ; కాలువ గట్లపై రోడ్డు బస్టాపుల పక్కన, ప్రభుత్వ కార్యాలయమైన పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రహరీని ఆనుకొని వెలసిన జగన్ పాలనలోని అమూల్ పాల దుకాణాల్ని ఏ అధికారులు తొలగించలేదని వ్యాపారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక హాకర్ జోన్‌లు, స్ట్రీట్ వెండర్ యాక్ట్‌లపై కనీస అవగాహన కల్పించకుండా పండుగ పూట తమను రోడ్డున పడేశారని మురళీనగర్ ప్రాంత దుకాణదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కమిషనరు ప్రకటించిన ప్రకారం జీవీఎంసీకి తమ విన్నపాల్ని సోమవారం పిజిఆర్ఎస్ (పబ్లిక్ గ్రీవెన్స్ రీ అడ్రసల్ సిస్టమ్) వేదికగా వినతి పత్రాలు అందించడానికి సన్నద్ధమవుతున్నారు. గడిచిన అయిదేళ్లలో ఓ రకంగా ఈ జగన్ దుకాణాలే ప్రేరణగా వరుసగా మాధవధార, ఎన్‌జీజీవోస్ కాలనీ ప్రాంతాల్లో కంటైనర్ మోడల్ బడ్డీలు స్థానిక నాయకుల అండదండలతోనే వెలిశాయి. రోడ్లు, పార్కులు, హైవే సర్వీసు రోడ్లను, మాధవధార నుంచి బిర్లా జంక్షన్ వరకు రూ.4 కోట్ల వ్యయంతో నవీకరించిన ఫుట్‌పాత్‌లను విచ్చలవిడిగా ఆక్రమించి టిఫిన్ దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్స్ నుంచి పాల వ్యాపారాలు, కాయగూరలు, పాన్ షాప్‌లు అధిక సంఖ్యలో పెరిగిపోయాయి. అమూల్ దుకాణాల ఏర్పాటు ప్రభుత్వ ఆదాయ మార్గం అయితే, స్ట్రీట్ వెండర్స్‌గా తాము చెల్లిస్తున్న ఆశీలు, పన్నులు కూడా ప్రభుత్వ ఖజానాకే కదా! అని అధికారులను దుకాణదారులు ప్రశ్నిస్తున్నారు.




మాధవధారలో తొలగించని బడ్డీ



మురళీనగర్ మసీదు దగ్గర మెట్ల మార్గాల్ని తొలగించిన దుకాణాలు

# మెట్టు-తాటిచెట్లపాలెం మధ్య మసకబారిన ప్రగతి



కంచరపాలెం మెట్టు నుంచి ధర్మానగర్‌కు వెళ్లే మార్గంలో అంధకారం



గతుకులమయంగా మారిన రోడ్డు

కంచరపాలెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం మెట్టు నుంచి ధర్మానగర్ మీదుగా తాటిచెట్లపాలెం వెళ్లే ప్రధాన మార్గంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. దశాబ్దాలుగా ఈ మార్గంలో వీధి దీపాలు ఏర్పాటు కాలేదు. రాత్రిపూట వాహనదారులు జాగ్రత్తలు పాటించి వెళ్లకపోతే ప్రమాదాలు తప్పవు సుమారు కిలోమీటరున్నర పొడవు గల ఈ మార్గం ఎన్ఏడీ నుంచి కంచరపాలెం మెట్టు మీదుగా నగరంలోకి వెళ్లడానికి ప్రధాన దారి కావడంతో నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. మెట్టు దాటి తిక్కవానిపాలెం, ధర్మానగర్, ఆశీర్వాద్ కల్యాణ మండపం, తాటిచెట్లపాలెం 28 బస్టాప్ వరకు ఎక్కడా వీధి దీపాలు కనిపించవు. చీకటి పడితే గాఢాంధకారం అలుముకుని ఉంటుంది. ఈ నేపథ్యంలో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అదే విధంగా రోడ్డు వెంబడి అంతా గతుకులమయంగా మారి రాళ్లుదేరి ఉంటుంది. వర్షం పడితే నీరు చేరి వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. అసలే చీకటితో పాటు రోడ్డుకు ఇరువైపులా గుంపులుగా కుక్కలు, ఆవులు నిలబడి ఉంటాయి. చీకటిలో కుక్కలు, ఆవులు రోడ్డు దాటుతుండడం వలన వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఎన్నో ఏళ్లగా ఈ సమస్య ఉన్నప్పటికీ ఎవరికీ పట్టకపోవడం గమనార్హం. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ఈ మార్గంలో వీధి దీపాలు తక్షణమే ఏర్పాటు చేసి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

# నేటి నుంచి దసరా స్పెషల్స్

**300 బస్సులు నడపనున్న ఆర్టీసీ**

ద్వారకాబస్‌స్టేషన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశాఖ రీజియన్ పరిధిలో సోమవారం నుంచి దసరా స్పెషల్స్ రోడ్డెక్కనున్నాయి. ప్రయాణికుల డిమాండ్ ఆధారంగా వీటిని నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్, విజయవాడ, కాకినాడ, రాజమండ్రి, భీమవరం వంటి దూరప్రాంతాలకు 100 బస్సులు, జోనల్ పరిధిలోని శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం, విజయనగరం, బొబ్బిలి, సాలూరు, రాజాం తదితర ప్రాంతాలకు 200 బస్సులు సిద్ధం చేశారు. షెడ్యూల్ సర్వీసుల సీటింగ్ సామర్థ్యానికి మించి ప్రయాణికుల డిమాండ్ ఉంటే ద్వారకాబస్‌స్టేషన్, మద్దిలపాలెం కాంప్లెక్సుల నుంచి వీటిని నడుపుతామని అధికారులు తెలిపారు. దూరప్రాంతాలకు గరుడ, గరుడప్లస్, డీలక్స్, అల్ట్రాడీలక్స్ బస్సులు నడుపుతారు.

**జోనల్ పరిధిలో స్త్రీశక్తి బస్సులు**

విశాఖ నుంచి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని పలుప్రాంతాలకు ఆర్డినరీ, పల్లెవెలుగు, అల్ట్రాపల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రోఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. విశాఖ నుంచి శ్రీకాకుళం, పలాస, టెక్కలి, ఇచ్ఛాపురం, సోంపేట, రాజాం, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు ప్రాంతాలకు ఉచితంగా ప్రయాణించేందుకు మహిళలు ఆసక్తి చూపే అవకాశం ఉందని భావించిన అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు చేశారు.

# తీరంలో పర్యాటకుల సందడి

సాగర్‌నగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌లు సందర్శకులతో ఆదివారం కిటకిటలాడాయి. గత కొద్ది రోజులుగా ఎండల తీవ్రత, ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో శ్రీకాకుళం, విజయ నగరం జిల్లాలతో పాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొందరు ఇసుక తిన్నెల్లో ఆటలు ఆడగా, మరికొందరు బోటు షికార్ చేస్తూ.. ఇంకొందరు సముద్రంలో స్నానాలు చేస్తూ ఉల్లాసంగా గడిపారు. కాగా సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉండడంతో బీచ్ రోడ్డులో పలుచోట్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. కొందరు రోడ్డు పక్కన వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల తరచూ ఈ సమస్య నెలకొంటోంది.

## ఇంజనీరింగ్‌లో అక్రమాలపై కమిషనర్ దృష్టి

... 5వ పేజీ తరువాయి

కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులు కుమ్మక్కవుపోతారనే ఆరోపణలతో పాటు పనుల్లో అక్రమాలకు చెక్‌పెట్టినట్టవుతుందన్నది కమిషనర్ ఉద్దేశం. ఒకవేళ ఏదైనా ఫైల్‌ను చూసినపుడు కమిషనర్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు ఎవరైనా ర్యాండమ్ తనిఖీల్లో ఏదైనా లోపం కనిపిస్తే సంబంధిత ఎమినిటీ సెక్రటరీ, ఏఈ బాధ్యత వహించాల్సి ఉంటుంది. దీనివల్ల అవినీతి ఆస్కారం లేకుండా పనిచేసేందుకు అవకాశం ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## పెందుర్తిలో ఆగని భూ ఆక్రమణలు

... 5వ పేజీ తరువాయి

ప్రహరీగోడ నిర్మించారు. అప్పటివరకూ మౌనంగా ఉన్న రెవెన్యూ సిబ్బంది ఆ తరువాత అడ్డుకోగా 1980లో అప్పటి కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్ కాపీని చూపిస్తున్నారు. ఆ స్థలం ఇప్పటికీ రెవెన్యూ రికార్డులో ప్రభుత్వ భూమిగానే ఉంది. కాగా పెందుర్తిలో కొన్ని చెరువులను ఆక్రమించుకుని పలువురు ఇళ్లు నిర్మించుకోగా, సుజాతనగర్ టీచర్స్ లేఅవుట్‌లో గెడ్డలు, వాగులు, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయి. చినముషిడివాడ చెరువులో ఆక్రమణ తొలగింపునకు వెళ్లిన రెవెన్యూ సిబ్బందిపై స్థానికులు దాడికి పాల్పడ్డారు. పెందుర్తి మండలంలో ఆక్రమణల తొలగింపునకు పోలీసుల నుంచి సహకారం అందడం లేదనే వాదన వినిపిస్తోంది. దీనికి కూటమి నేతల ఒత్తిడే కారణమని చెబుతున్నారు.

# లే అవుట్‌లలో దొంగలు!

... 5వ పేజీ తరువాయి

లేఅవుట్ నుంచి ఇసుక, సిమెంట్‌ను సమీప గ్రామాల ప్రజలు తక్కువ ధరకు కొనుగోలుచేశారనే ఆరోపణలున్నాయి. శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చే ఇసుకలోడ్ లేఅవుట్‌కు వెళ్లి అక్కడి నుంచి తిరిగి సమీప గ్రామాలకు తరలిపోతోందని రామవరం ప్రాంతానికి చెందిన నాయకులు చెబుతున్నారు. పద్మనాభం మండలం విజయరాంపురం లేఅవుట్‌లో సుమారు 300 టన్నుల ఇనుము తక్కువగా ఉందని రెండు నెలల క్రితం ఇన్‌చార్జి ఏఈ హౌసింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇప్పటికీ లెక్కలు తేల్చలేదు.

తాజాగా తునివలసలో ఇసుక ట్రాక్టర్‌తో తరలించడంపై ఫిర్యాదుచేయాలని ఈఈ సూరిబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. మెటీరియల్ తరలింపు బయటకు పొక్కితేనే పోలీసులకు ఫిర్యాదుచేయడం, సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇస్తున్నారు. లేదంటే పట్టించుకోవడం లేదు.

**అవసరానికి మించి వాడినా...**

భారీగా ఇళ్లు నిర్మిస్తున్న సంస్థ అవసరానికి మించి ఇనుము వినియోగించినట్టు తేలినా అధికారులు స్పందించడం లేదు. ఇద్దరు ముగ్గురు ఏఈలు ఆయా లేఅవుట్‌లలో చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలున్నాయి. రాజకీయంగా పలుకుబడి ఉండడంతో ఉన్నతాధికారులు కూడా వారిపై చర్యలు తీసుకోలేదనే వాదన ఉంది. వర్షాకాలం కావడంతో అన్నిలేఅవుట్‌లలో నిర్మాణాలు, ఇసుక సరఫరా నిలిచిపోయింది. నిల్వ మేరకు పనులు జరుగుతున్నాయి.

**లెక్కలు తేల్చాలని కలెక్టర్ ఆదేశం**

ఈ నేపథ్యంలో మెటీరియల్ నిల్వ లెక్కలు తేల్చాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు చేసిన నిర్మాణాలకు సరిపడా ఇసుము, ఇసుక, సిమెంట్ వినియోగించారా? తేడాలున్నాయా? ప్రభుత్వం సరఫరాచేసిన స్టాకులో ఎంత వినియోగించారు? తేల్చాలని ఆదేశించారు. దీంతో లేఅవుట్‌ల వారీగా లెక్కలు తేల్చేందుకు అధికారులు సన్నద్ధమవడంతో అక్రమార్కుల్లో ఆందోళన నెలకొంది. దీంతో వారంతా కాకిలెక్కలు వేసే పనిలో ఉన్నారని హౌసింగ్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

# కిడ్నీ రోగులకు ఆసరాగా..


అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో సేవలు పొందుతున్న రోగులు

» అగనంపూడి ఏరియా ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు

» ఎంతో ఉపయుక్తంగా ఉందంటున్న పారిశ్రామిక ప్రాంత ప్రజలు

అగనంపూడి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో గల మూత్రపిండ వ్యాధిగ్రస్తులకు అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం ఎంతో ఆసరా నిలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా 16 ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సుమారు రూ.50 లక్షలు వెచ్చించి ఇక్కడి ఏరియా ఆస్పత్రి రెండో ఫ్లోర్‌లో ఒక బ్లాక్ మొత్తంలో డయాలసిస్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ అన్ని వైద్య పరికరాలను అందుబాటులో ఉంచి కిడ్నీ బాధిత రోగులకు ఉచితంగా డయాలసిస్ సేవలందిస్తున్నారు.

ప్రస్తుత ఆహారపు అలవాట్లు, వాతావరణ ప్రభావం, కాలుష్యం కారణంగా మూత్రపిండాల వ్యాధిగ్రస్తుల సంఖ్య నానాటికీ పెరుగుతుంది. కిడ్నీలు దెబ్బతిన్న రోగులు తప్పనిసరిగా డయాలసిస్ చేయించుకోవాల్సిన అవసరం ఉంది. ఇది ఎంతో ఖర్చుతో కూడుకున్నది. ఒకసారి డయాలసిస్ చేయించుకోవాలంటే ఆస్పత్రి బిల్లు, రవాణా ఖర్చులు కలిపి సుమారు రూ.ఐదు వేలు ఖర్చవుతుంది. ప్రభుత్వం కిడ్నీ బాధితులకు పింఛన్ రూపంలో నెలకు రూ.పది వేలు ఇచ్చినా డయాలసిస్ చేయించుకునేందుకు ఎటూ ఆ మొత్తం చాలదు. దీంతో పేదలకు డయాలసిస్ అన్నది మోయలేనంత ఆర్థిక భారంగా మారింది. పేదలు ఇలాంటి ఇబ్బందులకు గురి కాకూడదనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం యోచించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని భావించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా 16 చోట్ల డయాలసిస్ యూనిట్లను నెలకొల్పడానికి రాహికేర్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. తొలి విడత 11 కేంద్రాలను ప్రారంభించేందుకు సన్నహాలు చేపట్టింది. ఇందులో భాగంగానే అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రిలో ఒక డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి పేదలకు సేవలందింస్తున్నారు.

### మెరుగైన వైద్య సేవలందిస్తాం..



-డాక్టర్ గోపీకృష్ణ,
ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

స్థానికంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం ద్వారా కిడ్నీ బాధిత రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడి అవసరాన్ని గుర్తించి డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం బాధితులకు వరం. రోగులకు ఎలాంటి ఖర్చు లేకుండా ఉచితంగా డయాలసిస్ చేస్తున్నాం.

### కిడ్నీ రోగులకు మేలు

పారిశ్రామిక ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ డయాలసిస్ కేంద్రం కిడ్నీ రోగులకు ఎంతో ఉపయుక్తంగా ఉంది. ఇప్పటివరకు కిడ్నీ వ్యాధి బాధితులు డయాలసిస్ చేయించుకునేందుకు నగరంలోని కేజీహెచ్, ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించేవారు. దీంతో వారు వ్యయ ప్రయాసలతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం స్థానికంగా డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### ఐదుగురికి ఒకేసారి సేవలందించేలా..

ఇక్కడి డయాలసిస్ కేంద్రంలో నిత్యం వైద్య సేవలందిస్తున్నారు. ఐదుగురికి ఒకేసారి డయాలసిస్ చేసేలా పడకలను ఏర్పాటు చేశారు. తాగునీటి కోసం ప్రత్యేకంగా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ అందుబాటులో ఉంది. రోజుకు పది మందికి డయాలసిస్ చేయడానికి తగిన సిబ్బందిని నియమించారు. ఒక డాక్టర్‌తో పాటు సాంకేతిక నిపుణుడు, స్టాఫ్ నర్సు, హౌస్ కీపింగ్ నర్సు, ఆయాను అందుబాటులో ఉంచారు. పనిచేసే సిబ్బందితో పాటు పరికరాలను రాహికేర్ సంస్థ సమకూర్చింది. ప్రస్తుతం ఈ కేంద్రం ద్వారా 30 మంది కిడ్నీ బాధిత రోగులకు సేవలందిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. రోజూ పది మంది రోగులకు డయాలసిస్ చేస్తున్నామన్నారు.

### ఆర్థిక భారం తప్పింది



-కూండ్రపు అచ్చియ్యమ్మ,
కిడ్నీ బాధిత రోగి, వాడచీపురుపల్లి

ప్రభుత్వం అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వల్ల తమలాంటి పేదలకు ఆర్థిక భారం తప్పింది. గతంలో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి డయాలసిస్ కోసం వెళ్లాల్సి వచ్చేది. ఒకసారి డయాలసిస్‌కు రవాణా చార్జీలతో కలిపి రూ.ఐదు వేల వరకు ఖర్చయ్యేది. ఆరు నెలలుగా ఇక్కడే ఉచితంగా డయాలసిస్ చేయించుకుంటున్నా. వారానికి రెండు రోజులు ఇక్కడకు వస్తున్నా. ప్రభుత్వ పుణ్యమాని వ్యయ ప్రయాసల భారం తగ్గింది.


కొత్తపాలెం ప్రధాన రహదారిలో కురుస్తున్న వర్షం


జలమయమైన పెందుర్తి కూడలి

# కుండపోత

» భారీ వర్షానికి ఉధృతంగా ప్రవహించిన గెడ్డలు

» విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోపాలపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కుండపోతగా కురిసిన వర్షానికి గోపాలపట్నం పరిసర ప్రాంతాల ప్రజలు ఊరట చెందారు. ఆదివారం సాయంత్రం సుమారు గంటపాటు కురిసిన భారీ వర్షానికి గోపాలపట్నం దిగువ ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొండవాలు ప్రాంతాల నుంచి వచ్చిన గెడ్డలు ఉధృతంగా ప్రవహించి కొత్తపాలెం గ్రామ శివారులోని లోతట్టు ప్రాంతాలు, వ్యవసాయ క్షేత్రాలు జలమయమయ్యాయి. వర్షం కురిసినంతసేపు ప్రధాన రహదారిలోని బీఆర్‌టీఎస్ రోడ్డుపై పలుచోట్ల వర్షపు నీరు పెద్దఎత్తున నిలిచిపోయింది. వర్షం కారణంగా కొత్తపాలెం, చంద్రనగర్, పాత గోపాలపట్నం ప్రాంతాల్లోని అండర్ పాస్‌వేల్లో నీరు చేరడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. కాగా గోపాలపట్నం దిగువ ప్రాంతాలైన కొత్తపాలెం, ఎల్లపువానిపాలెం గ్రామాల్లో సుమారు గంటన్నరసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లింది.

### పెందుర్తిలో దంచికొట్టిన వాన

**పెందుర్తి:** పెందుర్తిలో పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం ఎండ తీవ్రత, ఉక్కపోతతో ప్రజలు అల్లాడగా.. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృత్తమై ఉరుములు, మెరుపులతో 40 నిమిషాల పాటు వర్షం దంచికొట్టింది. దీంతో జనజీవనం స్తంభించడంతో పాటు పల్లపు ప్రాంతాల రహదారులపై పెద్దఎత్తున నీరు ప్రవహించింది. వర్షపు నీటితో పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి జలమయంగా మారింది. నీరు ప్రవహించే మార్గం లేక రోడ్డుపైనే వాన నీరు నిలిచిపోయింది. పెందుర్తిలోని ప్రశాంతినగర్, బాలాజీనగర్, దొగ్గవానిపాలెం కాలనీ, చినముషిడివాడలోని చాణక్యనగర్, క్రాంతినగర్, సుజాతనగర్‌లోని నాగమల్లి లేఅవుట్ 80 అడుగుల రోడ్డు బురదమయంగా మారడంతో అడుగు తీసి వేయలేని పరిస్థితి ఏర్పడింది.. జుత్తాడలోని జగన్న కాలనీ రోడ్డు బురదతో చిత్తడిగా మారింది.

# పెందుర్తి పోలీసులకు ఏఐపై శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రామకృష్ణ

పెందుర్తి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణలో ఆధునిక సాంకేతికత వినియోగం పోలీసులకు ఆయుధం వంటిదని రాంపురం సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ఏఐ నిపుణుడు కుమిలి రామకృష్ణ అన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో నేరాలు కట్టడి చేయవచ్చునన్నారు.

పెందుర్తి పోలీస్ స్టేషన్ సిబ్బందికి ఆదివారం ఏఐ టెక్నాలజీపై అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐ టూల్స్ వినియోగించి నేరాల కట్టడి ఎలా చేయవచ్చో ప్రయోగాత్మకంగా వివరించారు. భద్రతా కెమెరాల్లో ఏఐ టెక్నాలజీ వినియోగం, డ్రోన్ పోలీసింగ్, సైబర్ నేరాల నియంత్రణ, ఫేషియల్ రికగ్నైజేషన్ కెమెరా సాంకేతికతతో కేసుల నమోదు, నిందితుల గుర్తింపు, మానటరింగ్ సిస్టమ్ విధానంపై పోలీసులకు శిక్షణ ఇచ్చారు. డీప్ ఫేక్, ఫిషింగ్ స్కామ్, సోషల్ మీడియా అనాలసిస్, వాయిస్ రికగ్నైజేషన్ అంశాలపై అవగాహన కల్పించారు. ఏఐ హ్యాకథాన్ శిక్షణతో పోలీసులు నేర పరిశోధనలో ముందంజలో ఉండవచ్చని పేర్కొన్నారు. ఇందుకోసం జూమ్ ద్వారా రోజూ సాయంత్రం పోలీసులకు ఏఐ టెక్నాలజీపై ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్టు రామకృష్ణ పేర్కొన్నారు. పలువురు సిబ్బంది వ్యక్తం చేసిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్, క్రైమ్, శాంతిభద్రతల విభాగాల సిబ్బంది, మాజీ జెడ్పీటీసీ రెడ్డి నారాయణరావు పాల్గొన్నారు.


సంబరాల్లో పాల్గొన్న మహిళలు, యువతులు

## వైభవంగా బతుకమ్మ సంబరాలు ప్రారంభం

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బతుకమ్మ సంబరాలను వైభవంగా ప్రారంభించారు. తెలంగాణ సంప్రదాయం ఉట్టిపడేలా మహిళలు తీరొక్క పూలతో, వివిధ రకాల వంటకాలతో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్రాలు వేరైన తెలుగు వారందరూ ఒకటేనని పేర్కొన్నారు. నేడు ప్రపంచంలో తెలుగువారు అగ్ర స్థానంలో ఉన్నారని, ఇది ఎంతో మంచి విషయమన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఎస్.వీరేశం, ఎన్.కుమారస్వామి, జి.ఆనంద్, బి.వెంకటేశ్వర్లు, నరసింగరావు, మల్లేశం, రవికుమార్, అధిక సంఖ్యలో మహిళలు, యువతులు, చిన్నారులు పాల్గొన్నారు.

## 'దుకాణాల తొలగింపు అన్యాయం'

మల్కాపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పుట్‌పాత్‌పై వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారిపై జీవీఎంసీ అధికారులు కక్షగట్టి వారి దుకాణాలను తొలగిస్తుండడం అన్యాయమని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాండ్రేగుల సత్యాంజనేయ ఆవేదన వ్యక్తం చేశారు. మల్కాపురం గ్రామ మండలిలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ అధికారులు స్మార్ట్ సిటీ పేరుతో దుకాణాలను తొలగించడం దారుణమని మండిపడ్డారు. దీంతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు గుడాల రాంబాబు, నాయకులు చంద్రశేఖర్, రామకృష్ణ, కనకేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ టాప్-2 సైంటిస్టు జాబితాలో క్రాంతికుమార్


క్రాంతికుమార్ గంగూ

అగనంపూడి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ కళాశాలకు చెందిన డీన్ డాక్టర్ క్రాంతికుమార్ గంగూ ప్రపంచ టాప్ రెండు శాతం శాస్త్రవేత్తల జాబితాలో స్థానం లభించింది. ప్రతిష్ఠాత్మమైన స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ గుర్తింపు పొందుతూ వరుసగా 2024, 2025 సంవత్సరాలకు ప్రపంచంలోనే టాప్ రెండు శాతం సైంటిస్టు జాబితాలో ఆయన చేరారు. స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ విడుదల చేసిన జాబితాలో డాక్టర్ క్రాంతికుమార్ గంగూ గుర్తింపు పొందారని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.


ఎమ్మెల్యే పల్లా సతీమణి లావణ్య సమక్షంలో కేక్ కట్ చేస్తున్న నల్లూరు సూర్యనారాయణ

## ఘనంగా నల్లూరు జన్మదిన వేడుకలు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ జన్మది వేడుకలను కూటమి నాయకుల సమక్షంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అభిమానులు, కార్యకర్తల నడుమ కేక్ కట్ చేశాక గజమాలలతో ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సతీమణి లావణ్య మాట్లాడుతూ ప్రజల మనసులో సుస్థిర స్థానం సంపాదించుకున్న కార్యసాధకుడు నల్లూరు సూర్యనారాయణ అని కొనియాడారు. సేవాతత్పరత కలిగిన నల్లూరు సూర్యనారాయణ భవిష్యత్తులో ఉన్నత పదవులను అధిరోహించాలని ఆయన అభిమానులు ఆకాంక్షించారు. అనంతరం నల్లూరు మాట్లాడుతూ టీడీపీకి కార్యకర్తలే వెన్నెముక అని అన్నారు. తనపై చూపిన అభిమానాన్ని అందరూ భవిష్యత్తులోనూ చూపాలని కోరారు. రానున్న జీవీఎంసీ ఎన్నికలకు కార్యకర్తలందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆటో డ్రైవర్లకు యూనిఫారాలు, పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు, బీజేపీ జిల్లా కార్యదర్శి దేనంకొండ కృష్ణంరాజు, నాయకులు పావని, ప్రసాదుల శ్రీనివాసరావు, ఎం.పెంటిరాజు, వి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ కార్యకర్తకు లోకేశ్ ఫౌండేషన్ ఆర్థిక సాయం

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పక్షవాతంతో నాతయ్యపాలెంలోని ఇంటి వద్ద చికిత్స పొందుతున్న టీడీపీ సీనియర్ కార్యకర్త అవతారానికి ఆదివారం లోకేశ్ ఫౌండేషన్ సభ్యులు రూ.పది వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఫౌండేషన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ జి.గోపి, కె.శ్రీనివాసరావు, పద్మ, శ్వేత, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

### డీవైఎఫ్ఐ కార్యకర్తలకు నివాళి

మల్కాపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ములగాడ హౌసింగ్ కాలనీలో ఆదివారం డీవైఎఫ్ఐ మహాసభ జరిగింది. తొలుత ఇటీవల మృతి చెందిన కార్యకర్తలకు నివాళులర్పించారు. అనంతరం డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు యూఎస్ఎన్ రాజు మాట్లాడుతూ పీఎం మోదీ అవలంబిస్తున్న విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటుపరం అవుతున్నాయన్నారు. కార్యదర్శి వాసు నివేదికను సమర్పించారు. నాయకులు ఆర్ సమీన్, ఎ.ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మల్కాపురం శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బూడి శ్రీను, కార్యదర్శిగా ఎస్.వాసు, ఉపాధ్యక్షులుగా డి.రాజేశ్, జి.దాసు, కోశాధికారిగా గణేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సమీన్ ఎస్కే సుభాన్, సహాయ కార్యదర్శులుగా కిరణ్, శంకర్, ప్రసాద్, తదితరులు ఎన్నికయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరాజు

## సభ్యుల సంక్షేమమే ధ్యేయం

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య దృక్పథంతో కాకుండా సభ్యుల సహకారంతో వారి సంక్షేమంతో పాటు సొసైటీ ప్రగతికి పాలకవర్గం కృషి చేస్తుందని బెల్ హెచ్‌పీవీపీ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్, థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ ప్రధాన కార్యదర్శి మంద వెంకటరాజు అన్నారు. బెల్ కో-ఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం 56వ వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సుమారు ఏడు లక్షల రూపాయల వార్షిక లాభం సాధించినందున సొసైటీ సభ్యులకిచ్చే రుణాలపై వడ్డీ శాతాన్ని 14 నుంచి 12 శాతానికి తగ్గించనున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు కె.ధర్మారావు, డైరెక్టర్లు జీటీపీ ప్రకాశ్, గెడ్డం ప్రసాద్, కేఎస్‌వీ ప్రసాద్, ప్రశాంత్‌కుమార్, మేనేజర్ గవర వెంకటరమణతో పాటు పలువురు కార్మిక నాయకులు పాల్గొన్నారు.

### మాజీ కౌన్సిలర్‌కు చేయూత

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతున్న 68వ వార్డు మాజీ కౌన్సిలర్ గోపాలరావును ఆదివారం జనసేన పార్టీ వార్డు అధ్యక్షుడు మాకా షాలిని ఆధ్వర్యంలో పలువురు నాయకులు పరామర్శించారు. ఆయన ఆరోగ్య స్థితితో పాటు ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్న జనసేన నాయకులు మూడు నెలలకు సరిపడా నిత్యావసరాలను గోపాలరావు కుటుంబ సభ్యులకు అందజేశారు. నాయకులు గుర్రాల చిన్నా, నాగరాజు, లక్ష్మణ్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## సినిమా గైడ్

- **మిరాయి** : జగదాంబ, మెలోడి, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కిందపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక),
- **అర్జున్ చక్రవర్తి** : రమాదేవి,
- **మదరాసి** : శ్రీకన్య
- **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
- **కూలీ** :వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 12, టమాటా 26, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలు పు) 40, బెండకాయలు 24, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యా రెట్ 44, దొండకాయలు 34, బంగాళదుం పలు 19, అరటికాయ (పె)8, మునక్కాడ లు(కిలో)48, అల్లం (పాతది) 70, బరబా టి 32, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో ) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 24, వెల్లుల్లి(పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 32, క్యాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 38, చిలగడదుంపలు 38, కంద 50, దేముడుచిక్కుడు 708, గోరుచిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 80, కరివేపాకు (కి లో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 20, క్యరపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

| కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో) | |
|---|---|
| విశాఖపట్నం | 540 |
| విజయనగరం | 544 |
| శ్రీకాకుళం | 544 |

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | |
| రైతు ధర | 130 |
| లైవ్ ధర | 150 |
| విత్ స్కిన్ | 270 |
| స్కిన్‌లెస్ | 280 |


వడ్లపూడి-కణితి మార్గంలో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

## ముమ్మరంగా ఆక్రమణల తొలగింపు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడి నుంచి కణితి వరకు గల ప్రధాన రహదారులు, డ్రైనేజీలను ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీలను టౌన్ ప్లానింగ్ సిబ్బంది శని, ఆదివారాల్లో ఎక్స్‌కవేటర్లతో పోలీసుల సమక్షంలో తొలగించారు. వడ్లపూడి, ఈ-సేవా సెంటర్, తెలుకలవీధి, గవరవీధి, కణితి, తదితర ప్రాంతాల్లో అనధికారికంగా వ్యాపార సంస్థలను, తోపుడుబండ్లను ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయి, వాహనదారులు, పాదచారుల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల ఆయా ఆక్రమణలను తొలగించామని టౌన్ ప్లానింగ్ అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా అన్ని వార్డు ల్లోని ఆక్రమణలను తొలగిస్తామన్నారు. ఆక్రమణల తొలగింప పేరిట తమను రోడ్డుపాలు చేశారని పలువురు చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు స్థానికులు మాత్రం ఆక్రమణల తొలగింపుపై ఆనందం వెలిబుచ్చారు.

## ప్రసాదుల శ్రీనివాసరావుకు సత్కారం


ప్రసాదుల శ్రీనివాసరావును సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ డైరెక్టర్‌గా నియమితులైన జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, టీడీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావును ఆదివారం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం గాజువాకలో ప్రసాదుల శ్రీనివాసరావును కలిసి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు ఉరుకూటి బాబూరావు, పల్లా సత్యనారాయణ, పి.ఎల్లాజీరావు, పల్లా రమణ, వి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్‌కు 'భారతరత్న' ఇవ్వాలి

ఏపీ కాకతీయ కల్చరల్ అసోసియేషన్ డిమాండ్


మాట్లాడుతున్న ఏపీ కాకతీయ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి వెంకటసుబ్బరావు

మద్దిలపాలెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెంలోని కాకతీయ కన్వెన్షన్ హాలులో ఆదివారం కమ్మవారి సంఘాల పాలకవర్గం సభ్యుల ప్రాంతీయ సదస్సు జరిగింది. ఈ సమావేశంలో దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు 'భారతరత్న'పురస్కారం ఇవ్వాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఏపీ కాకతీయ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి వెంకటసుబ్బారావు, కార్యదర్శి బెజవాడ వెంకట్రావులు మాట్లాడుతూ గత అయిదేళ్లలో తమ సంఘాల ద్వారా చేసిన ఉద్యమాలు వివరించారు. చంద్రబాబును అరెస్ట్ చేసి 53 రోజులు జైలులో పెట్టినప్పుడు రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా, 73 దేశాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అమరావతి రైతుల ఉద్యమానికి పూర్తిస్థాయి మద్దతుగా నిలిచామన్నారు. ఎన్టీఆర్ హెల్త్‌యూనివర్సిటీ పేరు మార్పును ఖండించి ఉద్యమించామన్నారు.

గత ప్రభుత్వం హయాంలో అయిదేళ్లు ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, సామాన్య ప్రజలు కూడా అనేక ఇబ్బందులు పడ్డారని, ఇలాంటి సమస్యలు అధిగమించాలంటే మనమంతా యూనిటీగా ఉండి ఉన్న సంఘాలను బలోపేతం చేసుకోవాలన్నారు. సమాజ నిర్మాణంలో కుల మతాలకు అతీతంగా కమ్మ సామాజిక పెద్దల ద్వారా 70 శాతానికి పైగా అభివృద్ధి జరిగిందని తెలిపారు. కాకతీయ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒరిశా రాష్ట్రాల్లో అనేక సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. త్వరలో రాష్ట్రంలోని అన్ని సంఘాలతో విజయవాడలో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో కాకతీయ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్మారెడ్డి రాంబాబు, కాకతీయ కన్వెన్షన్ కోశాధికారి అన్నే బాలాజీ, రాష్ట్ర సమాఖ్య కోశాధికారి కొర్లపాటి అయోధ్యరామారావు, కార్యదర్శులు తమ్మినేని రమేష్, పిన్నమనేని వెంకటేశ్వరరావు, సభ్యులు వసంతకృష్ణ, బూరుగుపల్లి వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

## రామాలయ పునర్నిర్మాణం కోసం విరాళం

అగనంపూడి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి సమీప పెదమడక గ్రామంలో నిర్మిస్తున్న రామాలయ పునర్నిర్మాణం కోసం స్థానిక శ్రీపద్మ మార్కండేయ సేవా సంఘం అధ్యక్షుడు దొడ్డి దేముడు రూ.15 వేలను విరాళంగా ఆదివారం ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు విందుల నారాయణరావు, కె.అప్పారావు, విందుల చిరురాజు, కరణం సన్ని, లోవరాజు, వరహాల పంతులు, నరసింగరావు , తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి భవానీ భక్తులకు అన్న సమరాధన

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భవానీ దీక్షలో ఉన్న భక్తులకు సోమవారం నుంచి అన్న సమారాధన చేపట్టనున్నట్టు స్టీల్ ప్లాంట్ త్రిశక్తి ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. మాలధారణ చేసిన భక్తులకు సోమవారం నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు అన్నసమరాధన చేపడతామని పేర్కొన్నారు.

## కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఉక్కు అధికారులకు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు, నిర్వాసిత సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. ప్లాంటులో అధికారులతో నాయకులు సమావేశమై పలు అంశాలపై మాట్లాడారు. ప్లాంట్ కోసం భూములిచ్చిన నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నారని, గతంలో ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నారన్నారు. కలెక్టర్‌కు సమస్య విన్నవిస్తే త్వరలోనే లిస్టు విడుదల చేస్తామని చెప్పిన అధికారులు ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. కార్మికులకు న్యాయం చేసేంత వరకు పోరాటాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు మంత్రి రవి, నమ్మి రమణ, కె.వంశీకృష్ణ, భాస్కరరావు, అప్పారావు, సత్యారావు, అప్పారావు, రమణ, తదితరులు ఉన్నారు.

### బాలిక అదృశ్యంపై కేసు నమోదు

పెందుర్తి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గవర జగ్గయ్యపాలెం సమీప షీలానగర్‌లో నివాసముంటున్న వడ్డి మేనక అనే మహిళ ఆదివారం పనిమీద బయటకు వెళ్లి తిరిగి మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి కుమార్తె గీత (16) కనిపించలేదు. కుమార్తె సెల్‌ఫోన్ కూడా గదిలో లేకపోవడంతో స్నేహితులు, బంధువులు ఇళ్లలో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# ఇంద్రకీలాద్రికి దసరా శోభ

## నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

- ఈఏడాది 20 లక్షలమంది భక్తులు వస్తారని అంచనా
- 29న దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి స్నపనాది క్రతువు నిర్వహిస్తారు. తొలిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిస్తారు. ఉదయం 8-8.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది దేశం నలుమూలల నుంచి ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వీఐపీల కోసం స్లాట్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల వరకు కల్పిస్తారు. ఈ ఏడాది భక్తుల కోసం 20 లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల కారణంగా ఇంద్రకీలాద్రి విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా వెలుగుతోంది. 29వ తేదీ మూలానక్షత్రం రోజున అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

## విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపులు

### శరన్నవరాత్రులు ముగిసే వరకు అమలు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై సోమవారం నుంచి ప్రారంభమయ్యే దసరా శరన్నవరాత్రి మహోత్సవాల కారణంగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

- హైదరాబాద్-విజయవాడ-హైదరాబాద్-విశాఖపట్నం మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగి హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి వాహనాలు చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి నల్లకుంట వద్ద దిగి హైదరాబాద్ మార్గంలోకి వెళ్లాలి.
- హైదరాబాద్ - మచిలీపట్నం-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్న అవుటపల్లి వద్ద దిగాలి. కేసరపల్లి మీదుగా మచిలీపట్నం చేరుకోవాలి. ఇటు నుంచి వెళ్లే వాహనాలు కేసరపల్లి వద్ద నుంచి చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కాలి.
- హైదరాబాద్-చెన్నై-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా గుంటూరు చేరుకుని అక్కడి నుంచి చెన్నై వెళ్లాలి. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.
- చెన్నై-విశాఖపట్నం-చెన్నై మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఒంగోలు, త్రోవగుంట, చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ బైపాస్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి చెన్నై వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.

## నేటి నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు



శ్రీశైలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేసి గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, కంకణపూజ, కంకణధారణ తదితర పూజలు నిర్వహించనున్నారు. భ్రమరాంబికాదేవి అమ్మవారు సోమవారం శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ నిర్వహించనున్నారు.

# ఉత్తరాంధ్రకు వాయు'గండం'

- పిడుగులతో భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక
- బెజవాడలో 13 సెంటీమీటర్ల వర్షం.. నేడు ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్రకు వాయుగుండం పొంచి ఉంది. ఈ నెల 26న వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం 27న ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాలకు ఎక్కువగా ఉంటుందని, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోమవారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీంతో సోమ, మంగళవారాల్లో ఉత్తరాంధ్రలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 25న తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. మూడు రోజుల వ్యవధిలో ఏర్పడనున్న రెండు అల్పపీడనాల ప్రభావంతో ఈనెల 24 నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు, కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. విజయవాడ సింగ్‌నగర్‌లో 13, చిత్తూరు జిల్లాలోని కాగితలో 8.3, ఏలూరు జిల్లా కాకర్లమూడిలో 8, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో 6.9, చిత్తూరులోని యాదమర్రిలో 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, ఒకట్రెండుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని నిపుణుడొకరు తెలిపారు.

## అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభం వద్ద జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. న్యాయమూర్తి కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణ చేసిన అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను జ్ఞాపికగా అందజేశారు.

## నేటి నుంచి విశాఖలో 28వ జాతీయ ఈ గవర్నెన్స్ కాన్ఫరెన్స్

- ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుంది
- కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి



విశాఖపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ కాన్ఫరెన్స్‌ను ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి వి.శ్రీనివాస్ వెల్లడించారు. విశాఖలో ఆదివారం మాట్లాడుతూ.. వికసిత్ భారత్, సివిల్ సర్వీసెస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్‌తో సదస్సు ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ కాన్ఫరెన్స్‌ను ప్రారంబిస్తారన్నారు. ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుందని, ప్రస్తు తం 738 రకాలు సేవలు అందిస్తున్నారని, దీనిని దేశంలోనే అత్యుత్తమ మోడల్‌గా అభివర్ణించారు. విశాఖ డిక్లరేషన్‌లో దీనిని భాగం చేసి దేశమంతా అమలు చేసేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారన్నారు. అత్యుత్తమ కార్యక్రమాలు నిర్వహించిన వారికి ఈ గవర్నెన్స్- 2025 అవార్డులు అందిస్తామన్నారు.

## కూటమి నేతలపై అనుచిత పోస్టులు

- వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు



వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తో అంజాద్ ఖాన్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. కదిరి పట్టణానికి చెంది న కౌలేపల్లి అంజాద్‌ఖాన్ అలియాస్ మెగా అంజాద్ వైసీపీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తుండేవాడు. రెండ్రోజుల క్రితం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టడంతో అరెస్టు చేసినట్లు తెలిపారు.

## 27లోపు డిమాండ్లు పరిష్కరించాలి

- లేదంటే పెన్షన్ పంపిణీని నిలిపేస్తాం
- ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ

పెనమలూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27 లోపు తమ డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్చలకు పిలవని పక్షంలో అక్టోబరు 1 నుంచి పెన్షన్ పంపిణీని నిలుపుదల చేసేందుకు వెనుకాడబోమని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ హెచ్చరించింది. పోరంకిలో ఆదివారం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బగ్గా జగదీష్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో కలెక్టర్లకు, ఇతర అధికారులకు జేఏసీ తరఫున నోటీసులు అందజేస్తామన్నా రు. 26, 27 తేదీల్లో ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న అఫిషియల్ వాట్సాప్ గ్రూపుల నుంచి ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా వైదొలుగుతారన్నారు. 28న రాయలసీమ వేదికగా కర్నూలు జిల్లాలో ప్రాంతీయ సమావేశం ఏర్పాటుచేసి తదుపరి కార్యాచరణను విడుదల చేస్తామని తెలిపారు.

## తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలకు రేపు అంకురార్పణ

- ఎల్లుండి ధ్వజారోహణంతో ఉత్సవాలు ఆరంభం

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాలను ప్రారంభించడానికి మంగళవారం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయంలో సేనాధిపతిని అలంకరించి విశేష సమర్పణ గావిస్తారు. అనంతరం తిరుచ్చిపై ఆశీనులు చేస్తారు. రాత్రి ఏడు గంటలకు ఆలయం నుంచి బయల్దేరి నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత ఆలయానికి చేరుకున్న అనంతరం రంగనాయకమండపంలో ఆస్థానం జరుగుతుంది. యాగశాలలో అర్చకస్వాములు ఆగమోక్తంగా కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ(బీజవాపం) కార్యక్రమం నిర్వహిస్తారు. 24వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభవుతాయి.

## తప్పుడు వార్తలను నమ్మకండి

- కపిలతీర్థంలో ఎలాంటి తొక్కిసలాట జరగలేదు: టీటీడీ

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తొక్కిసలాట జరిగిందని, కపిలతీర్థంలో ఏర్పాట్లు చేయలేదని సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు వార్తలను భక్తులు నమ్మవద్దంటూ టీటీడీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. 'మహాలయ అమావాస్య సందర్భంగా తిరుపతి కపిలతీర్థం ఆలయం బయట ప్రైవేట్ వ్యక్తులు పితృతర్పణాల కార్యక్రమం చేసుకోవడం ఆనవాయితీ. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌ను టీటీడీ ఏర్పాట్లు చేసింది. రద్దీ నేపథ్యంలో భద్రతాపరంగా పటిష్ఠ చర్యలు తీసుకున్నాం. ఎస్పీ వాహనం, పోలీస్ వాహనం రావడంతో తొక్కిసలాట జరిగినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తిరుమలకు ఏమాత్రం సంబంధం లేకపోయినా ఇక్కడ తొక్కిసలాట అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కొంతమంది టీటీడీని లక్ష్యం చేసుకుని దుష్ప్రచారం చేయడం సరికాదు. టీటీడీ ప్రతిష్ఠను పలుచన చేయడాలని చూడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. ఇలాంటి వార్తలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అంటూ టీటీడీ తన సోషల్ మీడియా ద్వారా పేర్కొంది.

## విజ్ఞాన్ వర్సిటీలో 62వ జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు విద్య, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్ మాట్లాడుతూ ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశ్వనాథన్ ఆనంద్, హరికృష్ణ, హంపి, హరిదాసన్, ప్రగ్యానంద లాంటి ప్రతిభావంతులు దేశానికి ఎనలేని కీర్తి తెచ్చారని అశోక్ కొనియాడారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మొదటగా ఒక ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ లాల్‌త మునా, చీఫ్ ఆర్బిటర్ అనంత రామన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.సురేష్, చీఫ్ అడ్వయిజర్ కేవీవీ శర్మ, సెక్రటరీ కే.జగదీష్, గుంటూరు చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రవీంద్ర రాజు, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నగరంలో వర్షం



దొండపర్తి జంక్షన్ వద్ద కురుస్తున్న వర్షం



నగరంలోని పలుచోట్ల ఆదివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగగా, మధ్యాహ్నం మూడు గంటల తరువాత వాతావరణం ఒక్కసారిగా చల్లబడి వర్షం పడింది. ఉక్కపోత నుంచి ప్రజలు సేదతీరారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

## ఘనంగా గురజాడ జయంతి



గురజాడ అప్పారావు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న వీఎంఆర్‌డీఏ అధికారులు

విశాఖపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు 163వ జయంతి గురజాడ కళాక్షేత్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ కె. రమేశ్, తదితరులు గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు గురజాడ అప్పారావు నిరంతరం కృషి చేశారని, తన రచనల ద్వారా సమాజాన్ని చాలావరకు ప్రభావితం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కార్యదర్శి మురళీకృష్ణ, ముఖ్య గణాంకాధికారి హరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## పనిగంటల పెంపు బిల్లు ఉపసంహరణకు డిమాండ్



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

మహారాణిపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని సీఐటీయూ విశాఖ జిల్లా కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ విమర్శించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలను సమర్థిస్తూ రాష్ట్రంలో కార్మిక వర్గానికి తీవ్ర ద్రోహం చేస్తోందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం 8 గంటల పనిదినాన్ని 13 గంటలకు పెంచుతూ అసెంబ్లీలో పెట్టిన బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం జిల్లా కోర్టు సమీపంలోని సింగ్ హోటల్ జంక్షన్ వద్ద ఆందోళన నిర్వహించారు. కార్మికులపై పనిభారం పెంచటం దుర్మార్గమని వ్యాఖ్యానించారు. 136 సంవత్సరాల క్రితమే పెద్దఎత్తున పోరాటం చేసి ఎనిమిది గంటల పని విధానం సాధించుకున్న విషయాన్ని గుర్తుచేశారు. 13 గంటల పని బిల్లు అమలు జరిగితే కార్మికులు తిరిగి బానిసలుగా మారే పరిస్థితులు వస్తాయని, అందువల్ల వెంటనే శాసనసభలో ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని, జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించవలసి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో అజశర్మ, జగ్గునాయుడు, పి.మణి, బి. జగన్, ఎం.సుబ్బారావు, బి.శ్రీనివాసరాజు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.


## అల్జీమర్స్ రోగులకు అండగా నిలవాలి



డాక్టర్ గోపీని సన్మానిస్తున్న వైద్యులు

విశాఖపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వృద్ధాప్యంలో తీవ్ర ఇబ్బందులకు గురిచేసే అల్జీమర్స్ వ్యాధి బాధితులకు కుటుంబ సభ్యులు అండగా నిలిచి భరోసా కల్పించాలని పలువురు వైద్యులు పేర్కొన్నారు. వరల్డ్ అల్జీమర్స్ డే సందర్భంగా ఆంధ్ర మెడికల్ కళాశాల ఆవరణలో న్యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో సీఎంఈ నిర్వహించారు. ఈ సంద ర్భంగా వైద్యులు మాట్లాడుతూ అల్జీమర్స్‌ను ప్రాథమిక దశలో గుర్తించి కొన్ని రకాల వైద్య సేవలు అందించడం వల్ల సమస్య తీవ్రతను కాపాడేందుకు అవకాశం ఉందన్నారు. వయసు పెరుగుతున్న కొద్ది ఈ సమస్య తీవ్రత పెరుగు తుందని చెప్పారు. కొన్నిసార్లు ఇంటి నుంచి వెళ్లి బయటకు రాలేకపోవడం, ఇంట్లో ఉన్న రూమ్‌లు, కుటుంబ సభ్యులను మర్చిపోవడం వంటి ఇబ్బందులు ఉంటాయన్నారు. కొన్ని ముఖ్యమైన విషయాలను మర్చిపోతుంటారని పేర్కొన్నారు. అటువంటి వారికి భరోసా కల్పించాలని సూచించారు. అనంతరం న్యూరాలజీ వైద్య నిపుణులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యూరాలజీ వైద్యులు ఎం. మధుసూదన్‌బాబు, జి. బుచ్చిరాజు, కె. వెంకటేశ్వర్లు, కిశోర్‌బాబు, కె . సత్యా రారావు, న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ గోపి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ సుష్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాల పర్యవేక్షణకు కొత్త యాప్



ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, సీజీఎం శ్రీనివాస్‌కు జీపీఎస్ సర్వర్ అందజేస్తున్న జోహనిక్స్ సీఈవో శశాంక్

విశాఖపట్నం,సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) :విద్యుత్ స్తంభాల పర్యవేక్షణకు ఏఐ ఆధారిత యాప్‌ను ఈపీడీసీఎల్ అందుబాటులోకి తీసుకువచ్చింది. 'లైన్ క్వాలిటీ డిటెక్షన్' అప్లికేషన్ పేరుతో రూపొందించిన ఈ యాప్‌ను ఈపీడీసీఎల్, ఏయూ విద్యార్థులు, బెంగళూరుకు చెందిన జోహనిక్స్ సంస్థ అభివృద్ధి చేసింది. యాప్ ఆధారంగా స్మార్ట్‌ఫోన్‌తో ఈపీడీసీఎల్ ఉద్యోగి లైన్‌లో స్తంభాలను వీడియో తీయడం ద్వారా ఎక్కడైనా స్తంభం వాలిపోయినా, దెబ్బతిన్నా, ఇతరత్రా మరమ్మతుకు గురైనా వెంటనే గుర్తిస్తోంది. ఇప్పటివరకు 40 వేల స్తంభాల తాజా స్థితిని వీడియో తీయడం ద్వారా 800 స్తంభాలకు లోపాలను గుర్తించారు. కాగా కొత్తగా రూపొందించిన యాప్, దానికి సంబంధించిన సర్వర్‌ను జోహనిక్స్ సంస్థ సీఈవో శశాంక్ ఆదివారం ఈపీడీసీఎల్ సీఎం ఇమ్మడి పృథ్వీతేజ్‌కు అందజేశారు.

## అంబులెన్స్ వ్యవస్థపై అవగాహన

విశాఖపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అరిహంత్, ప్రభ జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు 108 వాహనం అధికారులు అంబులెన్స్ వ్యవస్థపై ఆదివారం అవగాహన కల్పించారు. వాహనాల పనితీరు, అత్యవసర పరిస్థితుల్లో కాల్ చేయడం ఎలా అన్నది వివరించారు. అలాగే రోగులకు ప్రథమ చికిత్సపై పలు అంశాలను వెల్లడించారు. అనంతరం ప్రాక్టికల్ సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరిహంత్ కళాశాల చైర్మన్ కె. శిరీషా, డైరెక్టర్లు రమేశ్ బిత్రా, డి. ఆనంద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభ వంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయదేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి సిరి సంపెంగలను తీసి భక్తులతో స్పృ శింపజేసి బేడామండప ప్రదక్షిణ చేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనముల జరిపి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు సిరి సంపెంగలతో పూజలు చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

## క్రైం... crime news

### లారీ ఢీకొని ఉక్కు ఉద్యోగి మృతి



పైల అప్పారావు (ఫైల్)

ఉక్కుటౌన్ షిప్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : శ్రీనగర్ జంక్షన్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉక్కు ఉద్యోగి మృతి చెందాడు. గాజువాక ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. అప్పికొండ నిర్వాసిత కాలనీకి చెందిన పైల అప్పారావు (56) ఆదివారం మధ్యాహ్నం వ్యక్తిగత పని మీద శ్రీనగర్ వెళ్లాడు. తిరిగి వచ్చేందుకు జంక్షన్‌లో వేచి ఉండగా స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం చేస్తున్న వ్యక్తి అటువైపు నుంచి రావడంతో అతని బైక్ ఎక్కాడు. బైక్ పై నుంచి ప్రమాదవశాత్తు జారి పడిపోవడంతో అదే సమయంలో వెనుక వస్తున్న లారీ అతన్ని ఢీకొంది. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఉక్కు జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషయంగా ఉండడంతో అక్కడి నుంచి కిమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. గాజువాక ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య



సాయి కిరణ్ కెవిన్ (ఫైల్)

పెందుర్తి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్టాక్ మార్కెట్‌కు సంబంధించి ఆన్‌లైన్ ట్రేడింగ్ నిర్వహించే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు, సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం.. సుజాతనగర్ టీచర్స్ లేఅవుట్‌లో నివాసం ఉంటున్న చంద్రశేఖర్ స్టాక్ మార్కెట్ ఆన్‌లైన్ ట్రేడింగ్ పని చేస్తుంటాడు. అతని కుమారుడు సాయి మారుతి కెవిన్ (26) కూడా అదే పని చేసేవాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో అందరితో కలిసి భోజనం చేసిన తరువాత నిద్ర వస్తోందని తన గదిలోకి వెళ్లాడు. సాయంత్రం ఎంతసేపటికీ గదిలో నుంచి బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యు లకు అనుమానం వచ్చి గది వెనుక ఉన్న కిటికీ తీసి చూశారు. అప్పటికే సాయి ఉరి వేసుకుని కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మృతదేహాన్ని కిందకి దించి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని సీఐ తెలిపారు.

### అదృశ్యమైన వ్యక్తి.. శవమై తేలాడు

పద్మనాభం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన వ్యక్తి రెండు రోజుల అనంతరం పొలంలో శవమై కనిపించాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. విలాస్కాన్‌పాలెం గ్రామానికి చెందిన బోని ముత్యాలనాయుడు (68) ఈనెల 18న ఇంటి నుంచి పొలానికి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పద్మనాభం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో ఉంది. సోమవారం ఉదయం ముత్యాలనాయుడు తన పొలంలో బోర్లా పడి ఉన్న విషయాన్ని స్థానికులు గమనించి మృతుడి కుమారుడు నరేశ్‌కు చెప్పారు.తన తండ్రి గుండెపోటుతో మృతి చెందినట్టు నరేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ సీహెచ్ శ్రీధర్ చెప్పారు.

### భవనంపై నుంచి జారి పడి వ్యక్తి మృతి

మద్దిలపాలెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందాడు. సిరిపురం పెట్రోల్ బంక్ ఎదురుగా ఏయూ కాన్వొకేషన్ వద్ద ఆదివారం ఉదయం ఈ సంఘటన జరిగింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. శివాజీపాలెంలో నివాసం ఉంటున్న బి. రాము (45) కూలీ పనులు చేస్తుంటాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఉదయం సిరిపురం ఎదురుగా ఉన్న ఏయూ కాన్వొకేషన్ భవనంపై వాటర్ ట్యాంక్ క్లీన్ చేయడానికి వెళ్లాడు. ట్యాంక్ క్లీన్ చేస్తుండగా నాచు ఎక్కువగా ఉండడంతో కాలు జారి కిందకు పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో మృతి చెందాడు.